STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 338 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 6 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

నిర్బంధం నుంచే 24 గంటలు!

- పోలీసులు అరెస్టు నమోదు ఆలస్యం చేసినా గడువు పొడిగించలేరు
- విచారణ, దర్యాప్తు పేరుతో నిర్బంధ సమయాన్ని మినహాయించడానికి వీల్లేదు
- గడువు దాటితే విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్ల పర్యవేక్షణ తప్పనిసరి

2



పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తిరస్కరించింది.

ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధం

రాహుల్‌కు అమిత్ షా సవాల్!

- ప్రధాని మోదీతో చర్చ కావాలంటే అధికారికంగా లేఖ రాయండి
- అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సిద్ధమని ప్రకటన
- బోగస్ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోంది?
- చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందే
- వీధుల్లో ఆందోళనలు కాదు.. పార్లమెంట్‌లో చర్చించాలని సూచన



పేజీలు 4లో..



భారీగా పెరిగిన బంగారం ధర

ఒక్క రోజే రూ.5వేలు పైకి..

4



అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది!

4

- గోకుల్ డెయిరీ ఎన్నికలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- పాడి రైతుల తీర్పును తారుమారు చేస్తున్నారని మండిపాటు
- ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్ల నియామకంపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

కొత్త ఓటర్ల నమోదులో కీలక మార్పులు!

- ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్‌ను వేరు చేసిన ఈసీ



4



డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు హాజరయ్యే అంతర్జాతీయ ప్రతినిధు లు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సదస్సుకు వచ్చే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా అనుసంధాన అధికారిని నియమించాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. వేదికలు, సమావేశ మందిరాలు, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, భద్రత, రవాణా, వసతి సౌకర్యాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

శభాష్ ఎస్డీఆర్ఎఫ్

పడవ బోల్తాపడి వరద ఉధృతిలో చిక్కుకున్న 11మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

- వరద సహాయక చర్యల్లో మీ సేవలు లేనివి
- సిబ్బందికి పాంగులేటి అభినందన
- అందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన సహాయక బృందాలు

2


ప్రతినిధులకు ఇబ్బందులుండొద్దు

హాజరయ్యే ప్రతీ ప్రతినిధికి లైజనింగ్ ఆఫీసర్

- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, క్లైమేట్ కాంక్లేవ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు
- 15నాటికి ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లపై రెడ్డి సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో గురువారం సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ

మిగతా 2 లో



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

- లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని సీఎం పిలుపు
- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో వినూత్న కార్యక్రమం

2

బేతుపల్లి చెరువులో గల్లంతైనవారు క్షేమం



- రాత్రంతా జాగారమే: ఒడ్డుకు చేరిన 11 మంది
- వెరీ గుడ్ కలెక్టర్ దివాకర్ అని ప్రశంసలు
- సీఎం రేవంత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కితాబు
- క్షేత్రస్థాయిలో మంత్రి తుమ్మల, పాంగులేటి పర్యటన

వివరాలు 2లో..

బీసీ ఆత్మగౌరవ భవనాలకు రూ.88.50 కోట్లు



మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసిన ప్రభుత్వం!

వివరాలు 3లో..


మోదీ నాయకత్వమే రక్ష

- ఓల్డ్ సిటీ నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రామచందర్ రావు



3

అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి



రేవంత్ ప్రభుత్వానికి కవిత డెడ్‌లైన్!

సీఎం సోదరుల అండతోనే అనుమతులు ఇస్తున్నారని సంచలన ఆరోపణలు

అయ్యప్ప సొసైటీలో ఇళ్లు కొనుగోలు చేసి మోసపోవద్దని ప్రజలకు సూచన

3



శభాష్ ఎస్డీఆర్ఎఫ్

వరద సహాయక చర్యల్లో మీ సేవలు లేనివి

సిబ్బందిని అభినందించిన మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, నవంబర్ 5 (సమయం న్యూస్) : సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో వరద ఉధృతిలో పడవ బోల్తా పడిన ఘటనలో బుధవారం రాత్రంతా వరదలో చిక్కుకున్న 11మంది ఎస్టీఆర్ ఎఫ్ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అభినందించారు.బుధవారం రాత్రి భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం(ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది సేవలు మరువలేనివని రెవెన్యూ, గృహ నిర్మాణం శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతోపాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన సహాయక చర్యలను అభినందించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి పొంగులేటి బేతుపల్లి పెద్ద చెరువు వద్ద పరిస్థితిని గురువారం పరిశీలించారు. అనంతరం దమ్మపేట మండలంలో మల్లెపూల వాగు, ముసలిబంధం చెరువుల వద్ద గండ్లు పడిన ప్రాంతాలను సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమన్నారు. విధి నిర్వహణలో చూపిన తెగువకు ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు. బేతుపల్లి చెరువులో బుధవారం రాత్రి ప్రమాదం జరిగిన విషయం తెలిసినప్పటినుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతర పర్యవేక్షించారు. బుధవారం రాత్రి పడవ బోల్తాపడి వరద ఉధృతిలో చిక్కుకున్న 11 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో పదిమందిని సహాయక బృందాలు తొలుత సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. అనంతరం గల్లంతైన మరో సిబ్బంది ఆచూకీ లభ్యమవడంతో అతడిని కూడా సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఖమ్మం పోలీస్ కమిషనర్, రెవెన్యూ, పోలీస్, రెస్క్యూ బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. అర్ధరాత్రి దాటే వరకు సహాయక చర్యలను ఫోన్ ద్వారా నిరంతరం పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి కల్లూరు మండలం నారాయణపురం చేరుకున్నారు.

సహాయక సిబ్బందికి భట్టి విక్రమార్క అభినందనలు

హైదరాబాద్ : బేతుపల్లి చెరువులో గల్లంతైన పదిమంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు ఒక స్థానిక వ్యక్తిని సురక్షితంగా రక్షించడంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. రాత్రంతా అవిశ్రాంతంగా కొనసాగిన సహాయక చర్యల అనంతరం మొత్తం 11 మందిని క్షేమంగా బయటకు తీసుకురావడం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆరఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలను ప్రశంసించారు. రాత్రంతా సహాయక చర్యలను భట్టి విక్రమార్క ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. గల్లంతైన వారందరినీ సురక్షితంగా కాపాడటంతో వారి కుటుంబ సభ్యులతోపాటు అందరిలోనూ ఆందోళన తొలగి ఉపశమనం కలిగిందని ఆయన అన్నారు.

బేతుపల్లి చెరువులో గల్లంతైనవారు క్షేమం

ఖమ్మం, నవంబర్ 5 : ఉద్వేగ క్షణాలు.. ఉత్కంఠ భరిత ఘటన అనంతరం గురువారం ఉదయం సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద ప్రశాంత వాతావరణం నెలకొంది. ముందు రాత్రంతా అక్కడ జాగరమే అయింది. ఏకంగా రెస్క్యూ అపరేషన్ కు వెళ్లిన 11 మంది గల్లంతుతో బేతుపల్లి చెరువు వార్తలకు ఎక్కింది. వారంతా క్షేమంగా రావడంతో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసలందుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద బుధవారం సాయంత్రం ఎనిమిది మంది జాలర్లు చెరువుకు వలలు కట్టేందుకు వెళ్లగా.. వరద ప్రవాహానికి అక్కడే చిక్కుకు పోయారు. స్థానికుల సమాచారంతో భద్రాచలంలో ఉన్న10 మందితో కూడిన ఎస్ డి ఆర్ఎఫ్(స్టేట్ ఫోర్స్) బృందం రంగంలోకి దిగింది. రక్షించే చర్యల్లో భాగంగా ముందుగా బోట్లలో వెళ్లిన సిబ్బంది ముగ్గురిని క్షేమంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. మరో ఐదుగురి కోసం ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి రెండు బోట్లలో చీకట్లోనే జాలర్లు చిక్కుకున్న ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగి రెండు బోట్లూ ఒకదానికొకటి ఢీకొని నీటిలోనే బోల్తాపడ్డాయి. దీంతో పది మంది ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బంది, ఒకరు స్థానికులు మొత్తం 11 మంది వరద ప్రవా హానికి చెల్లా చెదురయ్యారు. వరద ప్రవాహంలో చిక్కి చెల్లాచె దురైన ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బందిని రక్షించేందుకు విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు (సెంట్రల్ ఫోర్స్) అక్కడికి వెళ్లాయి. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో బెటాలియన్ కు చెందిన మంచాల వేణు ఆచూకీ లభించగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మొదట అతన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి 7.30 గంటల ప్రాంతంలో మిగతా వారిని గాలించి ఒడ్డుకు చేర్చడంతో వరద నీటిలో చిక్కుకున్నవారంతా సేఫ్ గా బయట పడ్డారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని గుండెనిండుగా ప్రశంసించారు. 'వెరీగుడ్ కలెక్టర్' అంటూ అభినందించారు. పోలీసులు సహా మొత్తం 16మంది ప్రాణాలను వరద నీటి నుంచి రక్షించడంలో అధికార యంత్రాంగం సమర్ధవంతతను ప్రదర్శించినట్లు తుమ్మల కీర్తించారు. ఆపద సమయంలో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసించారు. అదేవిధంగా ఎస్ డి ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కూడా మంత్రి తుమ్మల స్థానిక సత్తుపల్లి ఫారెస్ట్ గెస్ట్ హౌజ్ లో ఘనంగా సన్మానించారు. ప్రాణాలను కాపాడడంలో ఆయా విభాగాల సిబ్బంది పోరాట ప్రతిమ అమోఘమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని తుమ్మల పేర్కొన్నారు.

ప్రతినిధులకు ఇబ్బందులుండొద్దు

మొదటి పేజీ తరువాయి

పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించాలని సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. ఈనెల 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రదర్శించాలన్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్‌లో చర్చలు జరగాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్‌లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది సమ్మిట్‌తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల ఏర్పాట్లను అధికారులు వివరించారు. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్-2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు.

తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

- **లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు**
- **'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో వినూత్న కార్యక్రమం**



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్): పేదల సొంతింటి కల సాకారమైన వేళ వారి ఆనందంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి వినూత్న పిలుపునిచ్చారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వేడుకలు జరుపుకోవాలని రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు సూచించారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం వెల్లడించారు. పేదల సొంతింటి కల నెరవేరిన ఆనందాన్ని పంచుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సొంతింటి కల నెరవేర్చుకున్న కుటుంబాల మధ్య దీపావళి వేడుకలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ పథకాలను అమలు చేయడమే కాకుండా వాటి ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల సంతోషంలోనూ ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లకు స్వయంగా వెళ్లి లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని కోరారు. పేదల ఇళ్లలో వెలిగే దీపాలు వారి జీవితాల్లో కొత్త ఆశలకు ప్రతీకలుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించిన సహకారంతో సొంతింటిని నిర్మించుకున్న కుటుంబాలకు ఈ దీపావళి ప్రత్యేకమైనదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో, అరకొర వసతుల మధ్య జీవించిన కుటుంబాలు సొంతింట్లో పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. ఆ సంతోషాన్ని ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పంచుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య మరింత అనుబంధం పెరిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఎం పిలుపు నేపథ్యంలో తమ నియోజకవర్గాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకునేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూడా ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పేదలకు సొంతింటి వసతి కల్పించడమే కాకుండా వారి జీవితాల్లో ఆనందాన్ని నింపాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రతి పేద కుటుంబం దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లలో వెలిగే దీపాలు తెలంగాణవ్యాప్తంగా పండుగ శోభను తీసుకురావాలని ఆకాంక్షించారు.

అతిపెద్ద ఇండస్ట్రియల్ ఎక్స్‌పోగా 'సమ్మిట్'

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబర్ 5: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతిపై సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలను ఆహ్వానించామని, ఇప్పటికే అనేక సంస్థలు తమ భాగస్వామ్యానికి సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు. సమ్మిట్ నిర్వహణపై తాము ఆశించిన దానికంటే అధికంగా స్పందన లభిస్తోందన్నారు. ఈ సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్, ఫార్మా-లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ సమ్మిట్, ఏరోబాటిక్-ఎయిర్ షో తదితర ప్రత్యేక ప్రదర్శనలు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యంగా స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ యువత, జెన్-జీలోని సృజనాత్మకత, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, వ్యాపార అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించి వారిని 'రైజింగ్ తెలంగాణ విజన్'లో భాగస్వాములను చేయడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ పేర్కొన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు దిల్లీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధుల కోసం డెలిగేట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ కార్యదర్శులు ఇలంబర్తి, హరిచందన, గౌరవ్ ఉప్పల్, దివ్య దేవరాజన్, శశాంక, అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రూ.3 లక్షల బిల్లుల కోసం రూ.లక్ష డిమాండ్

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన స్పోర్ట్స్ అధికారి

మహబూబ్‌నగర్, నవంబర్ 5: మహబూబ్‌నగర్ జిల్లాలో లంచం తీసుకుంటూ యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ.3 లక్షల బిల్లుల చెల్లింపు కోసం యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాజేందర్ రెడ్డి లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. పథకం ప్రకారం గురువారం క్లాక్‌టవర్ సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేసిన అనంతరం కాంట్రాక్టర్ నుంచి రూ.లక్ష తీసుకుంటుండగా అధికారి, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వేగంగా వైఐపీ స్కూల్ నిర్మాణం

హైదరాబాద్, నవంబర్ 5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్-1 నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీజీపీ సి.వి.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంచిరేవులలో పాఠశాల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. పలు పనులకు అనుమతులు ఇస్తూ ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్, మౌలిక సదుపాయాలు, సీఎస్ఆర్, నియామకాలు, ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన తరగతి గదులతోపాటు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని డీజీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధన ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య, నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నారు. పోలీసు కుటుంబాల పిల్లలతోపాటు సాధారణ పౌరుల పిల్లలకూ అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించే ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు భవిష్యత్తులో మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 345 మంది విద్యార్థులు

6వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 720 మంది విద్యార్థులకు ప్రవేశాలు, మొత్తం 1000 మంది విద్యార్థులకు విద్య వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిజిపి సూచించారు. సమావేశంలో శాంతిభద్రతల డీజీ మహేష్ భగవత్, ఆక్టోపస్ డీజీ అనిల్‌కుమార్, ఐజీపీ ఎల్.గజరావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏజీ అడ్మిన్ రమణ కుమార్, డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, విశాల్ గోయల్, ప్రిన్సిపాల్ అనితారెడ్డి, జయకుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భవనాలకు రూ.88.50 కోట్లు

మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసిన ప్రభుత్వం!



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కేటాయించిన భవన నిర్మాణాలకు సంబంధించి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది. మినిస్టర్ క్వార్టర్స్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ఈ జీవో పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో స్థలాలు కేటాయించినప్పటికీ కొన్ని పాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని, హెచ్‌ఎండీఏ సహకారంతో ఆ సమస్యలను పరిష్కరించామని చెప్పారు. కుల సంఘాలకు కేటాయించిన స్థలాలను నిర్మాణాలకు అనువుగా తీర్చిదిద్దేందుకు 'రెడీ టు కన్స్ట్రక్షన్' విధానంలో లేఅవుట్లను అభివృద్ధి చేశామని వెల్లడించారు. నిధులు మంజూరు చేసినందున వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఈ కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు చేసుకోవాలని సూచించారు. ఏడాదిలోగా లేదా నిర్మాణ పరిస్థితులనుబట్టి నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. బీసీ కుల సంఘాలకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీలకు కేటాయించిన భూములు బలహీనవర్గాల ఆస్తులని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కాక ఏ ప్రభుత్వం కూడా తిరిగి తీసుకునే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత సంఘాల ప్రతినిధులను బాధ్యులుగా చేస్తూ పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ కుల సంఘాల భవనాల నిర్మాణం, నిర్వహణ కోసం ప్రభుత్వం జీవో నంబర్ 14 ద్వారా కొత్త కార్యవర్గాల ఎంపికకు మార్గదర్శకాలు తీసుకొచ్చిందని తెలిపారు. నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాలని, భవనాలను బీసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, వసతి సౌకర్యాలు, గ్రంథాలయాలు, సామాజిక కార్యక్రమాలు, కుల సంఘాల అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో పద్మశాలి, పేరక, గౌడ, కాపు తదితర కుల సంఘాల వసతి గృహాల ద్వారా వేలాదిమంది విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు నిర్మించబోయే ఆత్మగౌరవ భవనాలు భవిష్యత్ తరాలకు విద్యా, సామాజిక అభివృద్ధి కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ విధానంలో అంతర్భాగమని పేర్కొన్నారు. అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా పరిసరాల్లో ఉస్మానియా వర్సిటీకి సమీపంలో ఇప్పటికే ఉన్న స్థలాన్ని బీసీ అవసరాల కోసం వినియోగించుకోవాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సూచించారు. ఆ స్థలంలో ఇప్పటికే పూలే విగ్రహం ఏర్పాటు చేశామని, అక్కడ గ్రంథాలయంతో పాటు రవీంద్రభారతి తరహాలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తే విద్యార్థులకు, బలహీనవర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా మంత్రి పొన్నం ప్రత్యేక చొరవతో 40 బీసీ కుల సంఘాలు, 36 సంచార జాతుల కులాలకు కలిపి నిధుల మంజూరు జీవోలు అందించడం అభినందనీయమన్నారు. ఆత్మగౌరవ భవనాలు కేవలం భవనాలుగా కాకుండా విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, ఓబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి

రేవంత్ ప్రభుత్వానికి కవిత డెడ్‌లైన్!



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీ భూముల్లో వెంటనే సమగ్ర సర్వే నిర్వహించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా డిమాండ్ చేశారు. అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి నెల రోజుల సమయం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. అయ్యప్ప సొసైటీలో ఇల్లు కొని ఏ పౌరుడూ మోసపోయి నష్టపోవద్దని ప్రజలకు సూచించిన కవిత, ఈ అయ్యప్ప సొసైటీ పరిధిలో ఎలాంటి చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ సొసైటీ పరిధిలో దాదాపు 750 అక్రమ నిర్మాణాలు జోరుగా జరిగాయని ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అయ్యప్ప సొసైటీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదే సొసైటీ ప్రాంతంలో ప్రముఖ నారాయణ, చైతన్య విద్యా సంస్థలు ఉన్నాయని గుర్తు చేస్తూ, సర్వే నంబర్లు 11/18 నుంచి 11/44 వరకు పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు సాగాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు దగ్గరుండి అనుమతులు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరేమీ కనిపించడం లేదని కవిత వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ అక్రమ దందాను వెంటనే ఆపించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. గతంలో గురుకుల ట్రస్ట్ భూముల పరిరక్షణపై ఎన్నో ఉద్యమాలు చేశామని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు. మరోవైపు, ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి కేవలం రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలపై ఏం మాట్లాడలేదని విమర్శించారు. దిల్లీ వేదికగా కాంగ్రెస్ ధర్నా చేస్తే, దానికి పోటీగా అమిత్ షా హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారని తెలిపారు. ప్రాంతీయ పార్టీలపై నిందలు వేస్తూ మాట్లాడటం ఎవరికీ పనికొచ్చే అంశం కాదని కవిత అభిప్రాయపడ్డారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

- **సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లు**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



ఏటూరునాగారం, నవంబర్ 5 : గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులనూ అభినందించి ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం పీవో లెనిన్‌తో కలిసి విద్యార్థుల సమస్యలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టోల్ ఫ్రీ, వాట్సాప్ నంబర్ల సేవలను మంత్రి ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు. గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల్లోని విద్యార్థులు తమ సమస్యలను 1800-425-3369 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి లేదా 9493368361 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి తెలియజేయవచ్చని మంత్రి తెలిపారు. సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునేందుకు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, సహాయ గిరిజన అభివృద్ధి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, ఐటీడీఏ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాకు కేటీఆర్ ప్రశ్న

ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు

చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ

విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు. 'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.



మోదీ నాయకత్వమే రక్ష

ఓల్డ్ సిటీ నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రామచందర్ రావు

హైదరాబాద్, నవంబర్ 5: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వమే దేశానికి, రాష్ట్రానికి రక్ష అని విశ్వసించి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను వీడి బీజేపీలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపే చూస్తున్నారని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పాత బస్తీకి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, యువత భారీ సంఖ్యలో పార్టీలో గురువారం చేరారు. వారందరికీ రామచందర్‌రావు కాషాయ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జాంబాగ్ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వచ్చిన భాస్కర్, రాజ్‌పుత్ సమాజ్ ప్రతినిధులతోపాటు ఆదిత్య, బాలపరమేష్, ధరమ్ కుమార్, అమర్‌నాథ్, ప్రేమ్ కుమార్, గణేష్, పవన్ కుమార్, మహేశ్, బాలాజీ, మంగీలాల్, రూపేష్, హరీష్, మహేందర్, విక్రమ్, రాజేష్, రమేష్ ముదిరాజ్, సాయిబాబా, నరేష్, రాజు, బాలరాజు, రాహుల్, కార్తీక్, నవీన్ తదితరులు సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ యువతకు, నాయకులకు మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి అండ్ మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి సందీప్ సాయి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు గని కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సింగరేణి కార్మికులకు రూ.1,10,250 పీఎలఆర్ బోనస్ చెల్లింపు



న్యూదిల్లీ, నవంబర్ 5 : సింగరేణి కార్మిక సోదర, సోదరీమణులకు, వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి సందర్భంగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు (పీఎలఆర్) బోనస్ గురువారం అందజేయడం సంతోషకరమన్నారు. కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ప్రధాన కార్యాలయంలో జాతీయ కార్మిక సంఘాలతో కూడిన కోలిండియా సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో 2025-26లో సంస్థల పనితీరును పరిగణనలోకి తీసుకుని అర్హులైన కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా ఈ బోనస్ అందనున్నదని అన్నారు. ఇప్పటికే దసరా సందర్భంగా కార్మికులకు సంస్థ లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 అందించారు. తాజాగా పీఎల్ఆర్ బోనస్ కూడా అందుతుండటంతో పండుగ వేళ కార్మికులకు, వారి కుటుంబాలకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన బొగ్గును అందించడంలో సింగరేణి కార్మికుల కృషి ఎంతో విలువైనదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ శ్రమిస్తున్న కార్మికులు దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్నారని కిషన్‌రెడ్డి కొనియాడారు. వారి కష్టాన్ని, అంకితభావాన్ని అభినందించారు. సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలకు కేంద్రం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. దీపావళి పండుగ కార్మికుల కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆర్థికాభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

టీపీసీసీ విచారణకు మంత్రి దామోదర రాజనర్సింహ డుమ్మా..!



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఢిల్లీ షాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తన్నుకున్న ఘటనపై టీపీసీసీ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో జరిగిన గొడవపై వివరణ ఇవ్వాలని మంత్రి దామోదర రాజనర్సింహను ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని దామోదరకు సమాచారం కూడా అందించారు. అయితే దామోదర రాజనర్సింహ విచారణకు హాజరుకాలేదు. ఇప్పటివరకు గాంధీభవన్‌కు రాలేదు.. మరోవైపు మధ్యాహ్నం 2 గంటలకు రావాలంటూ లక్ష్మీకాంతారావుకు కూడా సమాచారం వెళ్లింది. షాంగ్రిలా హోటల్‌కు ముందు జరిగిన పరిణామాలను వివరిస్తానన్న లక్ష్మీకాంతారావు.. షాంగ్రిలా హోటల్ సీసీ టీవీ ఫుటేజీని తెప్పించారని... ఈ సీసీ కెమెరా ఫుటేజీని టీపీసీసీకి సాక్ష్యాలుగా సమర్పించబోతున్నారని సమాచారం.



కొత్త ఓటర్ల నమోదులో కీలక మార్పులు!

ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్‌ను వేరు చేసిన ఎన్నికల సంఘం

ఇకపై ప్రత్యేకంగా సమర్పించాల్సిన ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రం

దేశంలోని అన్ని రాష్ట్రాలకు కొత్త విధానం వర్తింపు

ఈసీ సమావేశాల అజెండా, నిర్ణయాల నమోదు తప్పనిసరి

విదేశీ పర్యటనలకు ముందస్తు అనుమతి..

సాంకేతిక వ్యవస్థల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేపట్టింది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో సమర్పించే ఫారం-6 నుంచి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ధ్రువీకరణ పత్రాన్ని వేరు చేసింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ కొత్త విధానం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తాజా మార్పులతో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునేవారు ఫారం--6తోపాటు ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సిన అవసరం ఉండదని, అవసరమైన సందర్భాల్లో దానిని ప్రత్యేకంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతోపాటు పరిపాలనలో పారదర్శకత పెంచడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. ఎన్నికల సంఘం అంతర్గత పరిపాలనా వ్యవస్థలోనూ పలు మార్పులు తీసుకొచ్చింది. అధికారిక సమావేశాల నిర్వహణలో స్పష్టత, జవాబుదారీతనం పెంచేందుకు కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇకపై ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశాలకు సంబంధించిన అజెండాను ముందుగానే సభ్యులకు అందించాల్సి ఉంటుంది. సమావేశం ముగిసిన తర్వాత చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను అధికారికంగా నమోదు చేసి సమావేశ వివరాలను జారీ చేయడం తప్పనిసరి చేసింది. గతంలో ఈ విధానం కచ్చితంగా అమలులో లేకపోవడంతో నిర్ణయాల నమోదు, సమాచార నిర్వహణలో మరింత స్పష్టత తీసుకురావాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘంలో పనిచేసే అధికారులు విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలని నిర్ణయించింది. అధికారిక విధులకు సంబంధించిన విదేశీ పర్యటనల విషయంలో నియంత్రణ, పర్యవేక్షణ పెంచేందుకు ఈ నిబంధనను తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త సమాచార సాంకేతిక వ్యవస్థల రూపకల్పన, పరిశీలన, ఆమోద ప్రక్రియలోనూ మార్పులు చేపట్టింది. గతంలో కొత్త సాంకేతిక వ్యవస్థల ఆమోదానికి సంబంధించి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తిన నేపథ్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇకపై కొత్త సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన ప్రతిపాదనలను తొలుత ఈ కమిటీ పరిశీలించనుంది. వాటి అవసరం, పనితీరు, అమలు సాధ్యాసాధ్యాలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన తర్వాతే తుది ఆమోదం కోసం ఎన్నికల సంఘం ముందుకు తీసుకురానుంది. మొత్తంగా ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాన్ని వేరు చేయడం కొత్త ఓటర్ల నమోదు విధానంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం

దుబాయ్‌లో సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్ అరెస్ట్

మరో నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను రప్పించే ప్రయత్నాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ యాప్ సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్‌ను దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భారత భద్రతా వర్గాలకు సమాచారం అందింది. మరో ప్రధాన నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను ఒమన్ నుంచి భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఉప్పల్ పట్టుబడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా సాగిన ఈ బెట్టింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు వర్గాలకు సంబంధాలున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో ఆరోపణలు వెలుగుచూశాయి. బెట్టింగ్ కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు కొందరు నేతలు రాజకీయ అండదండలు అందించగా, ఉన్నతాధికారులు, పోలీసులకు నెలవారీగా భారీ మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. యాప్ ప్రచారం, సాంకేతిక కార్యకలాపాలను చంద్రకర్ పర్యవేక్షించగా.. రాజకీయ నేతలు, అధికారులతో సెటిల్‌మెంట్లు, హవాలా మార్గాల్లో నగదు బదిలీల బాధ్యతలను ఉప్పల్ చూసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈడీ అంచనాల ప్రకారం మహాదేవ్ యాప్, దాని అనుబంధ వేదికల ద్వారా సుమారు రూ.94 వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. ప్రమోటర్లకు రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయం చేరినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఇందులో అధిక భాగం హవాలా మార్గాల్లో విదేశాలకు తరలించగా, కొంత మొత్తం రాజకీయ నాయకులు, అధికారులకు చేరినట్లు ఆరోపణలున్నాయి. 2023 అక్టోబర్‌లో జారీ చేసిన ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఉప్పల్‌ను దుబాయ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఈ పరిణామంపై యూఏఈ ప్రభుత్వ వర్గాల నుంచి భారత విదేశాంగ శాఖకు అధికారిక సమాచారం అందాల్సి ఉంది. దౌత్య మార్గాల ద్వారా ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు సంస్థలు చర్యలు చేపట్టాయి. ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చి విచారిస్తే బెట్టింగ్ సొమ్ము ఎవరెవరికి చేరింది? రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల పాత్ర ఎంత? హవాలా లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తులెవరు? అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ఆస్తుల సమీకరణకు ఈ నిధులు వినియోగించారన్న ఆరోపణలపైనా విచారణ జరగనుంది.

ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధం

- **రాహుల్‌కు అమిత్ షా సవాల్!**
- **ప్రధాని మోదీతో చర్చ కావాలంటే అధికారికంగా లేఖ రాయండి**
- **అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సిద్ధమని ప్రకటన**
- **బోగస్ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోంది?**
- **చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందే**
- **వీధుల్లో ఆందోళనలు కాదు.. పార్లమెంట్‌లో చర్చించాలని సూచన**



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపు వంటి అంశాలపై చర్చించేందుకు అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై వీధుల్లో ఆందోళనలు చేయడం కంటే పార్లమెంట్ వేదికగా చర్చించడం సముచితమని పేర్కొన్నారు. హరియాణాలోని కర్నాల్‌లో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా మాట్లాడారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం వల్ల ప్రయోజనం ఏమిటని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను తొలగించే ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. దేశంలో అక్రమంగా ప్రవేశించిన వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉంటే వాటిని తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడటం ఎన్నికల వ్యవస్థకు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ కార్యకలాపాలను కాంగ్రెస్ అడ్డుకుంటోందని అమిత్ షా ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నేతలు చట్టసభల్లో చర్చలకు ముందుకు రావాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలపై ఉన్న సందేహాలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రత్యేక సమావేశాల నిర్వహణకు కూడా వెనుకాడబోమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజలకు సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అన్నారు. ఈ సందర్భంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం ముఖ్యమని చెప్పారు. ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లను గుర్తించి తొలగించడాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. మరోవైపు నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రజలను ప్రభావితం చేస్తున్న కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో ఒకే వేదికపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశంలోని 73 శాతం మంది యువత ఇద్దరు నేతల మధ్య చర్చను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై దేశ అగ్రనేతలు బహిరంగంగా చర్చించడం ప్రజాస్వామ్యానికి అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. అయితే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.



భారీగా పెరిగిన బంగారం ధర

ఒక్క రోజే రూ.5వేలు పైకి..

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ పడిపోవడం తదితర కారణాలతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయంగా వీటి ధరలు పెరుగుతున్నాయి. ఆ ప్రభావంతో దేశీయంగానూ బంగారం, వెండి ధరలు దూసుకెళ్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మేలిమి 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1.49లక్షలకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.5వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1.35లక్షలు పలికింది. అటు వెండిపై గురువారం ఒక్కరోజే దాదాపు రూ.9వేలు పెరిగింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.04లక్షలకు చేరింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4129 డాలర్లకు ఎగబాకింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైనే పెరగడం గమనార్హం. ఇక, ఔన్సు వెండి ధర 52.83 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబరు డెలివరీ బంగారం 10 గ్రాములు రూ.1.45 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.89లక్షల వద్ద కొనసాగుతోంది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలతో డాలరు విలువ క్షీణించింది. దీంతో కేంద్ర బ్యాంకులు బంగారం కొనొచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు, డిసెంబరులో ఫెడ్ వడ్డీరేట్లు పెరగకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత పరిణామాల దృష్ట్యా మదుపర్లు తమ పెట్టుబడులను బంగారం, వెండిపైకి మళ్లిస్తుండటం వీటి ధరల పెరుగుదలకు కారణమైంది. ఇదిలా ఉండగా.. దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశి నేపథ్యంలోనూ ఈ లోహాలకు గిరాకీ పెరిగిందని బులియన్ వర్గాలు వెల్లడించాయి.

నిర్బంధం నుంచే 24 గంటలు!

పోలీసులు అరెస్టు నమోదు ఆలస్యం చేసినా గడువు పొడిగించలేరు

విచారణ, దర్యాప్తు పేరుతో నిర్బంధ సమయాన్ని మినహాయించడానికి వీల్లేదు

గడువు దాటితే విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్ల పర్యవేక్షణ తప్పనిసరి



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తిరస్కరించింది. విచారణ, దర్యాప్తు, తనిఖీల పేరుతో వ్యక్తిని పోలీసుల అదుపులో ఉంచిన సమయాన్ని మినహాయించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చంద్రుర్కర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కీలక తీర్పును వెలువరించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను పోలీసులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణం 22(2) ప్రకారం అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఈ గడువును లెక్కించేటప్పుడు న్యాయస్థానానికి తరలించేందుకు పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని పేర్కొంది. పోలీసుల విచారణ కోసం అదుపులో ఉంచిన సమయాన్ని పక్కనపెట్టి, అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును ప్రారంభించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే, ఇతర చట్టబద్ధమైన నిర్బంధ ఉత్తర్వులు లేని పక్షంలో సంబంధిత వ్యక్తిని విడుదల చేయాల్సి ఉంటుందని పేర్కొంది. పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్లు కచ్చితమైన పర్యవేక్షణ చేపట్టాలని ధర్మాసనం సూచించింది. వ్యక్తిని వాస్తవంగా ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారు, అధికారికంగా అరెస్టు ఎప్పుడు నమోదు చేశారు, ఎంతసేపు పోలీసుల నిర్బంధంలో ఉంచారు, నిర్ణీత గడువులోగా న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారా అనే అంశాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. అరెస్టు పత్రాల్లో పేర్కొన్న సమయాన్ని మాత్రమే కాకుండా వాస్తవ నిర్బంధ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. త్రిపురలో మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులో నలుగురి అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. కేసు వివరాల ప్రకారం 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు అధికారికంగా అరెస్టు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో 24 గంటల గడువును ఏ సమయం నుంచి లెక్కించాలన్న అంశం వివాదంగా మారింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం అధికారిక అరెస్టు నమోదు సమయం కాకుండా వాస్తవంగా నిర్బంధించిన సమయమే ప్రామాణికమని స్పష్టం చేసింది. పోలీసులు అరెస్టు నమోదు చేయడంలో జాప్యం చేయడం ద్వారా రాజ్యాంగపరమైన గడువును పొడిగించుకునే అవకాశం లేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛ, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణలో ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విచారణ పేరుతో వ్యక్తులను గంటల తరబడి అదుపులో ఉంచి, ఆ తర్వాత అరెస్టు నమోదు చేసే విధానంపై న్యాయపరమైన పర్యవేక్షణకు ఈ తీర్పు ప్రాధాన్యం కల్పించింది.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది!

- **గోకుల్ డెయిరీ ఎన్నికలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు**
- **పాడి రైతుల తీర్పును తారుమారు చేస్తున్నారని మండిపాటు**
- **ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్ల నియామకంపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్**



న్యూ ఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఇటీవల మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో జరిగిన గోకుల్ మిల్క్ కోఆపరేటివ్ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేయడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, డైరెక్టర్ల బోర్డులో మెజారిటీని అక్రమంగా దక్కించుకోవడానికి ఎన్నికలు ముగిసిన తర్వాత నిబంధనలను మార్చారని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు రాహుల్ గాంధీ గురువారం తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాడి రైతులు స్పష్టంగా బీజేపీ కూటమిని ఓడించారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత బీజేపీ నిబంధనలను మార్చిందని మండిపడ్డారు. ఇందుకోసం బోర్డులో నలుగురు నామినేటెడ్ డైరెక్టర్లను నియమించి, మొత్తం సభ్యుల సంఖ్యను 12 నుంచి 16కి పెంచి మెజారిటీని దొంగిలించిందని విమర్శించారు. ఇది ముమ్మాటికి పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమేనని, ప్రజా తీర్పును కల్తీ చేయడమేనని స్పష్టం చేశారు. కేవలం అధికారాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని, రైతుల ఓట్లను దొంగిలించే వారిని దేశంలోని రైతాంగం ఎప్పటికీ మరచిపోదని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఈ అంశంపై స్పందిస్తూ, ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వం తనకిష్టమొచ్చినట్లు నిబంధనలను ఎలా మారుస్తుందని ప్రశ్నించారు. అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ (కొల్హాపుర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం) ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గాను కాంగ్రెస్ నాయకుడు సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ దక్కించుకుందని గుర్తుచేశారు. అధికార మహాయుతి ప్యానెల్ కేవలం 12 స్థానాలకే పరిమితమైందని వివరించారు. మహాయుతి మద్దతు ఉన్న డైరెక్టర్లు గైర్హాజరై ఛైర్మన్ ఎన్నికను అడ్డుకున్న తర్వాత, నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. అయితే ఎన్నికైన బోర్డును సజావుగా పనిచేయనివ్వకుండా, రూ. 500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ ఉన్న సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించే కొత్త ప్రతిపాదనకు మహారాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, అందులో నలుగురికి ఓటింగ్ హక్కు కల్పించి తీర్పును తారుమారు చేయడానికి చూస్తోందని ఆరోపించారు. ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటానికి తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు పవన్ ఖేడా వెల్లడించారు. ఇదిలా ఉండగా, సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ల చోరీ' అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు కథ 'హక్కుల చోరీ' అని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ మంత్రి పదేపదే చెప్పడం మోదీ ప్రభుత్వ అధికారిక విధానమేనా అని జైరాం రమేశ్ తీవ్రంగా ప్రశ్నించారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల ఘన విజయం

- **ట్రంప్‌కు భారీ ఎదురుదెబ్బ.. హౌస్, సెనేట్ రెండింటినీ కైవసం చేసుకున్న డెమోక్రాట్లు**

వాషింగ్టన్, నవంబర్ 5:,(సమయం న్యూస్)

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రటిక్ పార్టీ మెజారిటీ సాధించింది. దీంతో అమెరికా కాంగ్రెస్‌పై డెమోక్రాట్ల ఆధిపత్యం ఏర్పడింది.హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో డెమోక్రాట్లు కనీసం 231 స్థానాలు గెలుచుకోగా, రిపబ్లికన్లు 141 స్థానాలు సాధించారు. మరికొన్ని స్థానాల్లో లెక్కింపు కొనసాగుతోంది. మెజారిటీకి అవసరమైన 218 స్థానాలను డెమోక్రాట్లు దాటడంతో సభపై నియంత్రణ ఖరారైంది.100 మంది సభ్యుల సెనేట్‌లో డెమోక్రాట్లు కనీసం 54 స్థానాలు, రిపబ్లికన్లు 44 స్థానాలు సాధించారు. అలాస్కా, మిసిసిప్పి రాష్ట్రాల్లో పోటీలు తుది దశకు చేరుకోలేదు. అయినప్పటికీ సెనేట్‌పై ఆధిపత్యానికి అవసరమైన సంఖ్యను డెమోక్రాట్లు సాధించారు. కీలక రాష్ట్రాల్లో సంచలన ఫలితాలురిపబ్లికన్లకు బలమైన రాష్ట్రాలుగా భావించే టెక్సాస్, కాన్సాస్, సౌత్ కరోలినా వంటి రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు సెనేట్ స్థానాలను కైవసం చేసుకున్నారు. కాన్సాస్‌లో 1932 తర్వాత తొలిసారిగా డెమోక్రటిక్ సెనేటర్ ఎన్నిక కావడం విశేషం. టెక్సాస్‌లో జేమ్స్ తలారికో విజయం సాధించగా, సౌత్ కరోలినాలో అన్నీ ఆండ్రూస్ గెలుపొందారు.ఓవా, మైన్, నార్త్ కరోలినా, ఒహియో రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు రిపబ్లికన్ ఆధిపత్య స్థానాలను తిప్పుకున్నారు. ఈ ఫలితాలు అమెరికా రాజకీయాల్లో గణనీయమైన మార్పుకు సంకేతంగా నిలిచాయి. ట్రంప్‌కు రాజకీయ ఇబ్బందులుఎన్నికల ఫలితాలతో అధ్యక్షుడు ట్రంప్ పదవి కోల్పోరు. ఆయన అధ్యక్షుడిగానే కొనసాగుతారు. అయితే కాంగ్రెస్‌లో రెండు సభలూ డెమోక్రాట్ల ఆధీనంలోకి రావడంతో ట్రంప్ తన విధానాలను చట్టాల రూపంలో అమలు చేయడం కష్టతరం కానుంది. బడ్జెట్, ప్రభుత్వ నిధులు, కొత్త చట్టాలు, అధ్యక్షుడి ప్రతిపాదనలు వంటి అంశాల్లో డెమోక్రాట్ల ఆమోదం కీలకం కానుంది. ట్రంప్ పరిపాలనపై కాంగ్రెస్ విచారణలు, పర్యవేక్షణ కూడా పెరిగే అవకాశం ఉంది. డెమోక్రటిక్ సెనేట్ ట్రంప్ ప్రతిపాదించే ఉన్నతస్థాయి నియామకాలను అడ్డుకునే అవకాశం కూడా ఉంది.వీటో అధికారంతో ట్రంప్‌కు కొంత రక్షణకాంగ్రెస్ ఆమోదించిన ప్రతి బిల్లును ట్రంప్ తప్పనిసరిగా ఆమోదించాల్సిన అవసరం లేదు. అధ్యక్షుడిగా ఆయన బిల్లును వీటో చేయవచ్చు. అయితే కాంగ్రెస్‌లోని రెండు సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధిస్తే ఆ వీటోను అధిగమించే అవకాశం ఉంటుంది.2028 అధ్యక్ష ఎన్నికలకు సంకేతం2026 మధ్యంతర ఎన్నికల ఫలితాలను 2028 అధ్యక్ష ఎన్నికలకు కీలక రాజకీయ సంకేతంగా పరిశీలిస్తున్నారు. జీవన వ్యయం, ఆర్థిక పరిస్థితులు, ట్రంప్ ప్రభుత్వ విధానాలు, ఇరాన్ యుద్ధం తదితర అంశాలపై ఓటర్ల అసంతృప్తి డెమోక్రాట్లకు అనుకూలంగా మారిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి.మొత్తంగా చూస్తే.. అమెరికా అధ్యక్ష పదవి ట్రంప్ వద్దే ఉన్నప్పటికీ, కాంగ్రెస్‌లో అధికార సమీకరణాలు పూర్తిగా మారాయి. హౌస్, సెనేట్ రెండింటినీ డెమోక్రాట్లు కైవసం చేసుకోవడంతో ట్రంప్ ప్రభుత్వానికి వచ్చే రెండేళ్లు రాజకీయంగా సవాళ్లతో కూడుకున్న కాలంగా మారనున్నాయి.

ప్రమిదల వెలుగుల్లో దివ్యాంగ పిల్లల ప్రతిభ.!

- **ప్రతిభకు దివ్యాంగత్వం అడ్డుకాదు.. ప్రేమతో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు**
- **మల్లికాంబ మనోవికాస కేంద్రం పిల్లల దీపావళి ప్రమిదల స్టాల్‌ను ప్రారంభించిన జిల్లా జడ్జి ఎం. సునిత**
- **కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి**

హన్మకొండ, నవంబర్ 5 (సమయం న్యూస్) :



దివ్యాంగుల పట్ల చూపించాల్సింది జాలి కాదని, ప్రేమతో కూడిన చేయూత, ప్రోత్సాహం అందించాలని హన్మకొండ జిల్లా జడ్జి ఎం.సునిత, డా.అనితా రెడ్డి అన్నారు. వారిలోనూ అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, సరైన ప్రోత్సాహం అందిస్తే ఆ ప్రతిభను వెలికితీయవచ్చని పేర్కొన్నారు.డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హన్మకొండ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కోర్టు ఆవరణలో మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగులు, బధిర పిల్లలు తయారు చేసిన దీపావళి ప్రమిదల స్టాల్‌ను గురువారం ప్రారంభించారు. హన్మకొండ జిల్లా జడ్జి ఎం. సునిత, వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ, ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి స్టాల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగత్వం శరీరానికే పరిమితమని, ప్రతిభకు కాదని స్పష్టం చేశారు. దివ్యాంగుల సేవ దైవసేవతో సమానమని పేర్కొన్నారు. పిల్లలు తయారు చేసిన ప్రమిదలపై అద్భుతమైన పెయింటింగ్, అలంకరణ వారి ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు.దీపావళి సందర్భంగా మార్కెట్‌లో ప్రమిదలు కొనుగోలు చేయడం కంటే ఈ పిల్లలు తయారు చేసిన ప్రమిదలను కొనుగోలు చేయడం ద్వారా వారికి సహాయ సహకారాలు అందించిన వారమవుతామని సూచించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు పిల్లలు తయారు చేసిన దీపాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ డీఎల్ఎస్ఏ కార్యదర్శి పూజిత, వరంగల్ డీఎల్ఎస్ఏ కార్యదర్శి పూజ, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె బిడ్డల ప్రతిభకు జాతీయ వేదిక..

- **తెలంగాణ కీర్తి పతాకను ఎగురవేయనున్న టెన్నికాయిట్ క్రీడాకారులు**
- **జమ్మూ కాశ్మీర్‌లో తెలంగాణ తరపున బరిలోకి**
- **క్రీడాకారులను అభినందించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

హనుమకొండ, నవంబర్ 5 (సమయం న్యూస్)



జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికై హనుమకొండ జిల్లాకు గర్వకారణంగా నిలిచిన క్రీడాకారులను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకోవడం హనుమకొండ జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని ఆయన కొనియాడారు.తెలంగాణ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అంబర్‌పేట జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన 10వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్2026 పోటీలలో ప్రతిభ చాటిన క్రీడాకారులు జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులు గురువారం ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.స్టేట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్, హనుమకొండ జిల్లా కార్యదర్శి అల్వాల రాజ్ కుమార్, ఉమ్మడి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ ఎండీ జహుర్ ఆధ్వర్యంలో క్రీడాకారులు డీసీసీ అధ్యక్షుడిని కలిశారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు బాలికల విభాగంలో జి. నవ్య - పరకాల టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాల (5వ స్థానం), బి. జ్యోతి - చిట్యాల టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాల (6వ స్థానం), పి. ప్రవీణ - ఎల్కతుర్తి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాల (7వ స్థానం), టి. అక్షయ - హసన్‌పర్తి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల (8వ స్థానం) కాగా బాలుర విభాగంలో ఎం. యశ్వంత్ - నర్సంపేట సైనిక్ స్కూల్ (1వ స్థానం), డి. వంశీ కృష్ణ - కరుణాపురం ఎంజేపీ విద్యాలయం (2వ స్థానం), డి. సాయినాథ్ - ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల (3వ స్థానం), ఎ. పునీత్ కుమార్ - కరుణాపురం ఎంజేపీ విద్యాలయం (4వ స్థానం), జి. ఆకాష్ - ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ పాఠశాల (5వ స్థానం), జె. శ్రవణ్ - జకారం సాంఘిక సంక్షేమ పాఠశాల (6వ స్థానం), ఎ. సాంబశివరావు - ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ పాఠశాల (7వ స్థానం) లో ఉన్నారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి క్రీడాకారుల మెరిట్ సర్టిఫికెట్లను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో నూ విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు వారి కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావంతుల గొంతుకకు 'బిట్స్' వేదిక..

- **7న నర్సంపేటలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం**
- **విద్యావంతులతో ముఖాముఖికి డాక్టర్ గడల శ్రీనివాసరావు**
- **ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి...జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ 'మేరుగు శివకోటి యాదవ్'**

నర్సంపేట, నవంబర్ 5 (సమయం న్యూస్)



నియోజకవర్గంలోని విద్యావంతులు, మేధావులు, పట్టభద్రుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో బిట్స్ కళాశాల లక్నేపల్లిలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ మేరుగు శివకోటి యాదవ్ తెలిపారు.ఈ నెల 7వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు లక్నేపల్లిలోని బిట్స్ కళాశాలలో నర్సంపేట నియోజకవర్గ విద్యావంతుల వేదిక - పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు,విద్యావంతులు, మేధావులు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మేరుగు శివకోటి యాదవ్ కోరారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- **సహకార రంగ అభివృద్ధికి కృషి చేయాలి... డిసిసి అధ్యక్షుడు 'మహమ్మద్ అయూబ్'**
- **వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డికి ఘన సన్మానం**

వరంగల్, నవంబర్ 5 (సమయం న్యూస్) :



వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన అబ్బిడి రాజిరెడ్డిని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన రాజిరెడ్డిని పార్టీ మండల, డివిజన్ అధ్యక్షుల సమక్షంలో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ రాజిరెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమం, సహకార రంగ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ఈ పదవి ఆయనకు మరిన్ని ప్రజా సేవా అవకాశాలను కల్పించాలని కోరుకుంటూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సత్యనారాయణ, మండల అధ్యక్షులు పొశాల వెంకన్న, ఇస్లావత్ సావిత్రి, దాడి శివ, ఇండ్ల రవి కుమార్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణాకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజ్ కుమార్, అశోక్, మహమ్మద్ జానీ, పసునూరి శ్రవణ్, కాంగ్రెస్ నాయకులు మన్నె బాబురావు, ఎల్గొండ ప్రవీణ్, గోదాసి చిన్న, కిన్నెర రవి, మంద సన్నీ, షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

తుపాను నష్టాలపై మంత్రి పొంగులేటి నేడు ఉన్నతస్థాయి సమీక్ష

సత్తుపల్లి:నవంబర్5(సాయం న్యూస్)



మురసు తుపాను కారణంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన నష్టంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు సత్తుపల్లి సింగరేణి అతిథి గృహంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు.రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వరద పరిస్థితులు, నష్టం, సహాయక చర్యల పురోగతిపై మంత్రి సమీక్షించనున్నారు.అంతకుముందు సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద సహాయక చర్యలను మంత్రి పరిశీలించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలను కూడా పరిశీలించి అనంతరం సమీక్ష సమావేశానికి హాజరుకానున్నారు.

అప్పాయిపల్లి లో అభివృద్ధి పనులకు భూమిపూజ

- **మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**

కొడంగల్ మండలం, నవంబర్,05(సమయం న్యూస్)

కొడంగల్ మండలం లోని అప్పెపల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మరియు నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంజీవరెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బాలరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.వీరితో పాటు గ్రామ సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ పకీరప్ప, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.ఈ అభివృద్ధి పనులు గ్రామంలో విద్యా సదుపాయాలను మరింత మెరుగుపరచడంతో పాటు చిన్నారులకు మెరుగైన అంగన్వాడీ సేవలు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆనందం తెలిపారు.



రాయికోడ్‌లో ఘనంగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

- **విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు అవగాహన – SA-1 ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 5:

రాయికోడ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (MPPS) రాయికోడ్‌లో పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (PTM) నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ఎల్.ఎఫ్.ఎల్. ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారుఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (SA1) పరీక్షల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. విద్యార్థుల పరీక్షల ఫలితాలు, అభ్యసన సామర్థ్యాలు, విషయాల వారీగా సాధించిన ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారువిద్యార్థుల విద్యాభివృద్ధిలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని సమావేశంలో వివరించారు. పిల్లలు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు, ఇంటి వద్ద చదువుకునే అలవాటును పెంపొందించాలని తల్లిదండ్రులకు సూచించారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచడానికి పాఠశాల మరియు తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపినప్పుడే మెరుగైన విద్యా ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారుఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలనే సందేశాన్ని అందించారు ఉపాధ్యాయులు శోభ యాదవ్ల విద్యార్థుల తల్లిదండ్రులు రాజు తదితరు పాల్గొన్నారు



న్యూ లక్ష్య ఆధ్వర్యంలో పేదలకు స్వెటర్ ల పంపిణీ

ఖమ్మం, నవంబర్ 5 : (సమయం న్యూస్)



న్యూ లక్ష్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం నగరంలోని పేదలకు స్వెటర్లను పంపిణీ చేశారు. సుమారు రూ.50,000 విలువ గల స్వెటర్లు పేదలకు ఖమ్మం టౌన్ లో పంపిణీ చేసిన అనంతరం సంస్థ అధ్యక్షులు గరిదేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఇంకా 30 నుండి 50 కోట్లకు పైగా ప్రజలు పేదరికంలో ఉన్నారు. రేషన్ కార్డులు 80+ కోట్లు ఉన్నాయి. 100 కోట్ల మందికి రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం అంటేనే దేశం ఎంత వెనుకబడి ఉందో అర్థం అవుతుందన్నారు. చలి కోటు పంచడం అంటే బట్ట పంచడం కాదు. మానవత్వం పంచడం.మీ ఇంట్లో మీరు వేసుకోని స్వెటర్ ఉంటే పడేయకండి. న్యూ లక్ష్యకు ఇవ్వండి. అది ఒక పేదవాడికి ఈ చలికాలంలో వెచ్చదనం అవుతుంది అని సంస్థ అధ్యక్షులు అన్నారు.

వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం అభినందనీయం

- **మంత్రి పొంగులేటి**

సత్తుపల్లి, నవంబర్ 5:(సమయం న్యూస్,)

మురసు తుపాను ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వరద పరిస్థితులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలు, మత్స్యకారులు, సహాయక సిబ్బందిని సురక్షితంగా రక్షించిన ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను అభినందించారు.వరద నష్టాన్ని రెండు మూడు రోజుల్లో సమగ్రంగా అంచనా వేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న చెరువులు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, పంటలను త్వరగా పునరుద్ధరించాలని సూచించారు. సహాయక చర్యల్లో పాల్గొన్న అర్హులైన సిబ్బందికి ఇందిరమ్మ ఇళ్లు అందించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.భద్రాద్రి జిల్లాలో సుమారు 9 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.



ఈనెల 7న జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలి

వలిగొండ నవంబర్ 05 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఈనెల 7వ తేదీన వలిగొండ మండలం కేంద్రం నుండి వెళుతున్న సందర్భంగా మండలంలోని బీసీలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు బొలుగుల నరసింహ కోరారు. గురువారం మండల కేంద్రంలో పాదయాత్ర కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా పోరాడి రాజ్యాధికార దిశగా సాగాలని ఆయన అన్నారు.రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీలను అణగదొక్కుతూ కొద్దిమంది ఉన్నత వర్గం వారు రాజ్యాలనేలుతూ బీసీలను ఓటు బ్యాంకు గానే చూస్తూ అవమాన పరుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా ఏకతాటిపై నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బిసి రాజ్యాధికారం కోసం ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల పర్మింగ్ ప్రెసిడెంట్ గొలుసుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ రమేష్, వలిగొండ టిప్పర్ అసోసియేషన్ నాయకులు గండికోట శ్రీశైలం, పల్లపు శ్రీశైలం, గండికోట రాజశేఖర్, గండికోట రాజు, ఓర్సు కనకసారయ్య, దుంప శ్రీను, రమేష్, పీట్ల ఐలేష్, పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ

వలిగొండ నవంబర్ 05 (సమయం న్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి సాధన నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం నుంచి మంజూరైన ఉచిత యూనిఫామ్ ను గురువారం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నరేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సమానత్వ భావన, క్రమశిక్షణ, ఐక్యత, పెంపొందించడంలో యూనిఫామ్ లు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు.ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అందిస్తున్న సౌకర్యాలను ,సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. రాబోవు రోజులలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతి కల్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరుశరాములు, కుమార్రైదా,లిత పాల్గొన్నారు.



విధి నిర్వహణకు గుర్తింపు పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు!

- **సీపీ రష్మీ పెరుమల్ చేతుల మీదుగా అవార్డుల స్వీకరణ**

రాయపోల్: నవంబర్ 05.

విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చినందుకు సిద్ధిపేట జిల్లా రాయపోల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు దుంపలపల్లి స్వామి, ఘనపురం వికాస్ రెడ్డిలకు ప్రశంసా పత్రాలు లభించాయి. సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమల్ చేతుల మీదుగా వారు ఈ ప్రశంసా పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు స్వామి, వికాస్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవలను గుర్తించి తమను అభినందించడం మరింత ఉత్సాహాన్ని, ప్రేరణను ఇచ్చిందని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా భవిష్యత్తులోనూ మరింత బాధ్యతతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ గుర్తింపు తమ విధి నిర్వహణలో మరింత నిబద్ధతతో ముందుకు సాగేందుకు దోహద పడుతుందని వారు వెల్లడించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం తోటే అభివృద్ధి

- **సంగారెడ్డి పట్టణం లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి**
- **13వ వార్డులో రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం**
- **34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం**

సంగారెడ్డి, సమయం న్యూస్, ననవంబర్05

పట్టణంలోని 13, 34వ వార్డుల్లో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారుపట్టణంలోని 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ, కౌన్సిలర్లు వీణా కిరణ్, అన్వర్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, అడ్డూ, మున్నా, రాజు పాల్గొన్నారు.



కొడంగల్ మున్సిపాలిటీలో వయోవృద్ధుల సంక్షేమ చట్టానికి సంబంధించిన నోటీస్ బోర్డు ప్రారంభం

కొడంగల్ మున్సిపల్, నవంబర్,05(సమయం న్యూస్)

కొడంగల్ మున్సిపాలిటీ కార్యాలయంలో తల్లిదండ్రులు,వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం-2007, నియమావళి (రూల్స్)-2011 కు సంబంధించిన బుక్ నోటీస్ బోర్డును కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వయోవృద్ధులు మరియు తల్లిదండ్రులకు సంబంధించిన చట్టాలు, వారి హక్కులు, సంక్షేమానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం ఈ నోటీస్ బోర్డు ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, 10వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల నరసింహులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ప్రజా ఉద్యమ నేతలు నీలం రామచంద్రయ్య, జంపాల ప్రసాద్ చిరస్మరణీయులు

ఆలేరు, నవంబర్ 05(సమయం న్యూస్):

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన కామ్రేడ్లు నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర ప్రసాద్ లు చిరస్మరణీయులని పలువురు వక్తలు అన్నారు. సీపీఐ(ఎంఎల్) ఎన్‌డీఆర్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆలేరులోని పార్టీ కార్యాలయంలో గుండె రమేష్ అధ్యక్షతన వారి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం రామచంద్రయ్య చిత్రపటానికి ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జన్నె మల్లేష్, జంపాల చంద్రశేఖర ప్రసాద్ చిత్రపటానికి పీవోడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు పంగ అంజయ్య మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడిన వీరిద్దరిని అప్పటి జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత మార్చారని ఆరోపించారు. వారి ఆశయాలు, పోరాట స్ఫూర్తి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి కూడా మాట్లాడారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు పి నాగరాజు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు టి శ్రవణ్, ప్రజాసంఘాల నాయకులు జి సత్తయ్య, పి సునీల్, ఎం గణేష్, జె స్వామి, కె సునీత, కె అన్నపూర్ణ పాల్గొన్నారు.

నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

- **చివరి దశ పనులన్నీ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి.**
- **పెండింగ్ పనుల్లో వేగం పెంచాలి.**
- **నాణ్యతలో రాజీ పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

నారాయణపేట, నవంబర్,05(సమయం న్యూస్)

నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ భవన సముదాయంలోని వివిధ విభాగాలు,ఛాంబర్లు, సమావేశ మందిరాలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను నిశితంగా తనిఖీ చేసి, నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.నూతన కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సమావేశ మందిరం తదితర విభాగాల్లో కొనసాగుతున్న ఫర్నిచర్ ఏర్పాటు పనులను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఆయా గదుల్లో ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్ నాణ్యత, అమరిక, ఇంటీరియర్ డిజైన్ పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఛాంబర్లు ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా ఉండేలా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫర్నిచర్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న సౌండ్ సిస్టమ్, ఫర్నిచర్ పనులను పరిశీలిస్తూ, సమావేశాలు,ఉన్నతాధికారులతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు ఎలాంటి అంతరాయం కలగకుండా సౌండ్ సిస్టమ్ స్పష్టమైన శబ్ద నాణ్యతతో పనిచేసేలా చూడాలని సూచించారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలు సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు.కార్యాలయానికి వచ్చే అధికారులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. పార్కింగ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వెంకట రమణయ్యను ఆదేశించారు. కలెక్టరేట్ భవన సముదాయంలో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను సైతం నిర్లక్ష్యం చేయకుండా గుర్తించి పూర్తి చేయాలని, అన్ని విభాగాల్లో విద్యుత్, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పది రోజుల్లోగా చివరి దశ పనులన్నింటినీ పూర్తి చేసి నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభోత్సవానికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు.ఈ పరిశీలనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్డీఓ వెంకట్ రాములు, కలెక్టరేట్ ఏవో, సీపీఓ ఆర్‌అండ్‌బీ డీఈఈ తహసీల్దార్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

- **రూ.18 వేల స్థిర వేతనం, ఈఎస్ఐ, పెన్షన్ కల్పించాలి**
- **కలెక్టర్, డీఎంహెచ్ఓకు బీఆర్‌టీయూ సమ్మె నోటీసులు**
- **బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు**

నర్సంపేట, నవంబర్ 5 (సమయం న్యూస్) :



ప్రజలకు నిరంతరం ఆరోగ్య సేవలందిస్తూ వైద్య ఆరోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి ఆశా కార్యకర్తలు సమ్మెకు దిగనున్నట్లు హెచ్చరించారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేకపోవడంతో బీఆర్‌టీయూ-సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓలకు సమ్మె నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశాల యూనియన్ (బీఆర్‌టీయూ అనుబంధ) జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య, సీఐటీయూ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ రాణి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆశా కార్యకర్తలు ఎన్నో సంవత్సరాలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర ఆరోగ్య సేవలందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఆశా కార్యకర్తలకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, స్థిరమైన పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ లీడర్లు పిట్ట శ్రీలత, తంగేళ్ల సుజాత, సబియా బేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేద్దాం

- **సేవాభావం లో పేద విద్యార్థుల ఆదుకుందాం:**
- **జాతీయ ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత యాస మల్లారెడ్డి**

పెద్దేముల్ మండలం, నవంబర్,05(సమయం న్యూస్)

నిరుపేదలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని జాతీయ ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత యాస మల్లారెడ్డి, గిర్మాపూర్ సర్పంచ్ శివరాం నాయక్ అన్నారు. పెద్దేముల్ మండలం గిర్మాపూర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రంలో సీనియర్ నాయకులు రాంరెడ్డి పటేల్, వేమారెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీ కాంత్ రెడ్డి తదితరులతో కలసి అంకిత, మల్లారెడ్డి ఫౌండేషన్ ల సహకారంతో విద్యార్థులకు బ్యాగులు, చెప్పులు, మ్యాట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ గా, రాజకీయ నాయకులు గా రాణిస్తున్నారని అలాగే అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా పేరు పొందుతున్నారని చెప్పారు. ఇటీ వల కాలంలో ప్రైవేటు మోజు పెరిగి ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారుతుందని ఇందుకుగాను ప్రతి ఒక్కరు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సామాజిక స్ఫూర్తితో తమ వంతు సహకారం అందించాలని చెప్పారు. మేధావులు ,నైపుణ్య వంతులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి సహకరించాలని కోరారు. గతంలో బషీరాబాద్ మండలం లోని నావాంద్గి తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు.



తాము బషీరాబాద్, తాండూర్ లతో పాటు హైదరాబాద్ నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం లో తదితర ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకున్నట్లు చెప్పారు.గ్రామీణ నిరుపేద విద్యార్థులు అంబేద్కర్,అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద స్ఫూర్తితో మహోన్నతులుగా ఎదగాలని అన్నారు. సర్పంచ్ శివరాం నాయక్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన చైత్ర రెడ్డి, అవంతిక రెడ్డి లు ప్రభుత్వ పాఠశాలల్లో చెందుతూనే క్రీడల్లో జాతీయ, రాష్ట్ర,జిల్లా స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. తమ గ్రామంలోని విద్యార్థులకు సహాయం అందిస్తున్న మల్లారెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ నాయకులు రాంరెడ్డి పటేల్, ఉప సర్పంచ్ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తమ గ్రామానికి ఆర్టీసీ అధికారుల తో మాట్లాడి మాల్లారెడ్డి బస్సులు వేయించారని గుర్తు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాములు, ఉపాధ్యాయులు సుజాత, అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి, నాయకులునాగిరెడ్డిపరుశరం,మైసప్ప,మల్లారెడ్డి, బంటు రాములు ఆయనతో ఉన్నారు.

దౌల్తాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- **బీజేపీ సీనియర్ నేత దార సత్యనారాయణ డిమాండ్**
- **సాగు చేసిన ప్రతి రైతు కుటుంబానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలి**

రాయపోల్ నవంబర్ 05. (సమయం న్యూస్)

సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ బీజేపీ సీనియర్ నాయకులు దార సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిరైతులుపెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాలను



చవిచూస్తున్నారని పేర్కొన్నారు. అప్పులు చేసి వ్యవసాయం చేసిన రైతులు ఇప్పుడు అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారని అన్నారు.ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి, సాగుచేసిన ప్రతి రైతు కుటుంబానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు.రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.కరువు పరిస్థితులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నల్గొండలో 15న జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

- **బైక్ ర్యాలీ సందర్భంగా**
- **సిర్పంగి స్వామి పిలుపు.**

వలిగొండ నవంబర్ 05 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐకేఎస్ అఖిలభారత 36వ జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్గొండ జిల్లా కేంద్రంలో ఎన్జీ కళాశాల మైదానంలో జరుగు భారీ బహిరంగ సభలో రైతులు వ్యవసాయ కార్మికులు కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో మహాసభల జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న నల్గొండ జిల్లా కేంద్రం ఎన్జీ కళాశాల మైదానంలో జాతీయ 36వ మహాసభల సందర్భంగా భారీ బహిరంగ సభను లక్షలాది మందితో నిర్వహించడం జరుగుతుందని ఈ బహిరంగ సభకు ఏఐకేఎస్ జాతీయ నాయకత్వం వివిధ రాష్ట్రాల నుండి హాజరవుతారని తెలిపారు దేశంలో బిజెపి 2014లో అధికారం చేపట్టిన తర్వాత అనేక రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ రైతాంగాన్ని వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు ఒకవైపు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక మరొకవైపు సరైన మార్కెట్ సౌకర్యం లేక సామాజిక భద్రత లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ఇప్పటికే జాతీయ స్థాయిలో అనేక రైతు వ్యతిరేక చట్టాలపై ఏఐకేఎస్ జాతీయ స్థాయి పోరాటాలను నిర్వహించిందని పాలకుల మెడలువంచిందన్నారు ఈ మహాసభల్లో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందని మహాసభలను మరియు బహిరంగ సభ జయప్రదం కోసం ప్రజలందరూ సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారుఈ కార్యక్రమంలో రైతు,వ్యవసాయ కార్మిక,కెవిపిఎస్,డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ, పలు సంఘాల నాయకులు కూర శ్రీనివాస్, కొండే కిష్టయ్య, చీర్క శ్రీశైలం రెడ్డి,కల్కూరి ముత్యాలు,దుబ్బ లింగం, కవిడే సురేష్,వేముల నాగరాజు, గర్దాసు నరసింహ,రెడ్డి ,పెద్ద బోయిన భీమరాజు,మైసోల్ల నరేందర్,వేముల నరసింహ, పాల్గొన్నారు.

రైతుల రుణాల రీషెడ్యూలింగ్‌కు తక్షణ చర్యలు

ఖమ్మం, నవంబర్ 5:,,(సమయం న్యూస్)

కరువు ప్రభావిత ప్రాంతాల్లో అర్హులైన రైతుల రుణాలను వెంటనే రీషెడ్యూల్ చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో 10 మండలాలు తీవ్ర, 7 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు.తీవ్ర కరువు మండలాల్లో రుణ చెల్లింపు గడువును 60 నెలలు, మోస్తరు కరువు మండలాల్లో 36 నెలలు పొడిగించడంతో పాటు 12 నెలల మారటోరియం కల్పించాలని సూచించారు. రీషెడ్యూలింగ్ రుణమాఫీ కాదని, రైతులకు అదనపు చెల్లింపు సమయం కల్పించే ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రెండో పంట సాగు చేయవద్దని, నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని సూచించారు.

కీపర్ చేసిన చిన్న తప్పు..

గెలుపోటములే తారుమారు!

- చివరి బంతికి అనూహ్య మలుపు..
- సూపర్ ఓవర్ లేకుండానే రెనెగేడ్స్ విజయం
- వికెట్ల ముందుకు వచ్చి బంతిని అందుకున్న హోబర్ట్ వికెట్ కీపర్
- నిబంధనల ఉల్లంఘనతో నోబాల్ ప్రకటించిన అంపైర్
- చేతిదాకా వచ్చిన అవకాశం చేజారడంతో హరికేన్స్‌కు నిరాశ
- మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అరుదైన ఘటన



హోబర్ట్, నవంబర్ 5 (సమయం న్యూస్): మహిళల బిగ్ బాష్ లీగ్‌లో ఓ అరుదైన ఘటన మ్యాచ్ ఫలితాన్నే తారుమారు చేసింది. హోబర్ట్ హరికేన్స్, మెల్‌బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో చివరి బంతికి వికెట్ కీపర్ చేసిన చిన్న పొరపాటు హోబర్ట్ జట్టు ఓటమికి కారణమైంది. మ్యాచ్ టై అయి సూపర్ ఓవర్‌కు దారితీస్తుందని భావించిన సమయంలో వికెట్ కీపర్ లిజెల్ లీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో అంపైర్ నోబాల్ ప్రకటించారు. దీంతో అదనపు పరుగు లభించిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్ అనూహ్య విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హోబర్ట్ హరికేన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ నికోలా కేరీ అద్భుతంగా రాణించి 43 బంతుల్లో 10 ఫోర్లతో 62 పరుగులు సాధించింది. ఆమె అర్ధశతకంతో హోబర్ట్ ప్రత్యర్థి ముందు 155 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌కు ఓపెనర్ హేలీ మాథ్యూస్ అర్ధశతకంతో శుభారంభం అందించింది. అయితే మధ్య ఓవర్లలో వరుసగా వికెట్లు కోల్పోవడంతో రెనెగేడ్స్ ఒత్తిడిలో పడింది. 101 నుంచి 138 పరుగులకు చేరుకునే క్రమంలో ఐదు కీలక వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది. చివరి బంతికి రెనెగేడ్స్ విజయానికి ఒక్క పరుగు అవసరమైంది. అప్పటికే ఇరు జట్ల స్కోర్లు 154 పరుగులతో సమమయ్యాయి. నికోలా కేరీ వేసిన ఆఖరి బంతిని డియాండ్రా డాటిన్ సరిగా ఆడలేకపోయింది. బంతిని వికెట్ కీపర్ లిజెల్ లీ అందుకోవడంతో బ్యాటర్లు పరుగు సాధించలేకపోయారు. దీంతో మ్యాచ్ టై అయిందని, విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్ నిర్వహించాల్సి ఉంటుందని ఇరు జట్లు భావించాయి. అయితే అదే సమయంలో మూడో అంపైర్ బంతికి సంబంధించిన దృశ్యాలను పరిశీలించడంతో అసలు మలుపు చోటుచేసుకుంది. దృశ్యాలను పరిశీలించిన అంపైర్‌కు వికెట్ కీపర్ లిజెల్ లీ బంతిని అందుకునే సమయంలో తన చేతులను వికెట్ల ముందుకు తీసుకొచ్చినట్లు కనిపించింది. క్రికెట్ నిబంధనల్లోని 27.3 ప్రకారం బౌలర్ వేసిన బంతి బ్యాటర్‌ను లేదా బ్యాట్‌ను తాకే వరకు, వికెట్లను దాటే వరకు లేదా బ్యాటర్ పరుగు కోసం ప్రయత్నించే వరకు వికెట్ కీపర్ పూర్తిగా వికెట్ల వెనుకే ఉండాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే అంపైర్ నోబాల్ ప్రకటించే అవకాశం ఉంటుంది. లిజెల్ లీ చేతులు వికెట్ల రేఖను దాటి ముందుకు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో అంపైర్ నోబాల్ ప్రకటించారు. దీంతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ ఖాతాలో అదనంగా ఒక పరుగు చేరింది. ఫలితంగా సూపర్ ఓవర్ అవసరం లేకుండానే రెనెగేడ్స్ విజయం సాధించింది. చివరి బంతి వరకు పోరాడిన హోబర్ట్ హరికేన్స్‌కు వికెట్ కీపర్ చేసిన పొరపాటు తీవ్ర నిరాశ మిగిల్చింది. అప్పటివరకు మ్యాచ్‌ను సమం చేసిన ఆనందంలో ఉన్న హోబర్ట్ ఆటగాళ్లు అంపైర్ నిర్ణయంతో నిరాశకు గురయ్యారు. మరోవైపు ఓటమి అంచుల నుంచి అనూహ్యంగా విజయం దక్కడంతో రెనెగేడ్స్ ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. క్రికెట్‌లో ఒక్క చిన్న పొరపాటు కూడా మ్యాచ్ ఫలితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

కాలం ఎవరికీ ఆగదు

విరాట్ కోహ్లీ ఆఖరి పోరాటం

అయినా ఇంకా 14 కొట్టొచ్చు ఇలా!



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ ఇప్పటికే ఎన్నో చారిత్రాత్మక రికార్డులు, మైలురాళ్లతో నిండిపోయింది. వన్డే ప్రపంచ కప్, టీ20 ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టైటిళ్లను అందుకున్న కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరపున ఐపీఎల్ ట్రోఫీని కూడా ముద్దాడాడు. దీంతో తన సుదీర్ఘ కెరీర్‌లో చాలా కాలంగా ఎదురుచూస్తున్న మరో పెద్ద కలను నెరవేర్చుకున్నాడు. అయినప్పటికీ కోహ్లీ ఆటలో మాత్రం ఇప్పటికీ అదే చెక్కుచెదరని దూకుడు కనిపిస్తోంది. 38 ఏళ్ల వయసులోనూ పరుగుల వేటను కొనసాగిస్తూ సరికొత్త రికార్డుల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాడు. సాధారణంగా 38 ఏళ్ల వయసులో చాలామంది క్రికెటర్లు ఆటకు వీడ్కోలు పలికి కామెంటేటర్లుగా, విశ్లేషకులుగా మారుతుంటారు. కానీ కింగ్ కోహ్లీ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా మైదానంలోనే తన అసమాన సత్తా చాటుతున్నాడు. ఫిట్‌నెస్, క్రమశిక్షణ, పరుగుల కోసం తపన, మైదానంలో చురుకుదనం.. ఇలా ప్రతి విషయంలోనూ తన ప్రత్యేకతను కాపాడుకుంటున్నాడు. వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తడం, ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడం, మైదానంలో నిరంతరం ఉత్సాహంగా కనిపించడం వంటి లక్షణాలు అతడిలో అలాగే ఉన్నాయి. అయితే కాలం ఎవరికీ ఆగదు కాబట్టి, 2027 వన్డే ప్రపంచ కప్ కోహ్లీ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి టోర్నీ కావచ్చని క్రికెట్ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రపంచ కప్ ట్రోఫీని మరోసారి అందుకుని కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలనే లక్ష్యం అతడికి ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. దానికి తోడు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 అంతర్జాతీయ సెంచరీల రికార్డు కూడా కింగ్ ముందున్న మరో ప్రధానమైన సవాలు. ప్రస్తుతం విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 86 సెంచరీలు సాధించాడు. సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల ప్రపంచ రికార్డును సమం చేయాలంటే మరో 14 శతకాలు సాధించాల్సి ఉంది. టెస్టులు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు వీడ్కోలు పలికిన తర్వాత ఈ



రికార్డును అందుకోవడం కోహ్లీకి మరింత కష్టంగా మారింది. అయినప్పటికీ 2025లో టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత వన్డేల్లో అతడి బ్యాట్ నుంచి ఏకంగా నాలుగు సెంచరీలు రావడం అభిమానుల్లో సరికొత్త ఆశలు రేకెత్తించింది. దక్షిణాఫ్రికాతో 2025 నవంబర్ 30న రాంచీలోని జేఎస్‌సీఏ స్టేడియంలో జరిగిన వన్డేలో కోహ్లీ 135 పరుగులు చేశాడు. ఇది అతడి 52వ వన్డే సెంచరీ కాగా, అంతర్జాతీయ కెరీర్‌లో 83వది. ఆ తర్వాత డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 102 పరుగులు చేసి 53వ వన్డే శతకాన్ని, 84వ అంతర్జాతీయ సెంచరీని నమోదు చేశాడు. అనంతరం 2026 జనవరి 18న ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో మరోసారి 102 పరుగులతో మెరిశాడు. ఇది అతడికి 54వ వన్డే సెంచరీ, 85వ అంతర్జాతీయ శతకం. ఇక 2026 సెప్టెంబర్ 27న తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో వెస్టిండీస్‌పై అజేయంగా 139 పరుగులు చేసి 55వ వన్డే సెంచరీని, 86వ అంతర్జాతీయ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నాలుగు సెంచరీలు కేవలం 16 మ్యాచ్‌ల్లోనే రావడం విశేషం. అంటే ప్రతి నాలుగు వన్డేలకు ఒక సెంచరీ చొప్పున సాధించాడు. ఇదే స్థాయి ప్రదర్శనను కొనసాగిస్తే 100 సెంచరీల రికార్డు దిశగా అతడు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. 2027 వన్డే ప్రపంచ కప్‌కు ముందు భారత్ ఇంకా పలు వన్డే సిరీస్‌లు, టోర్నీల్లో పాల్గొనాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో నాలుగు వన్డేలు, శ్రీలంకతో మూడు, జింబాబ్వేతో మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. అలాగే 2027లో వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఆసియా కప్‌లో భారత్ గరిష్ఠంగా ఏడు మ్యాచ్‌లు ఆడవచ్చు. వీటితో పాటు బీసీసీఐ ఖరారు చేయని మరో ఆరు వన్డేలు కూడా షెడ్యూల్‌లో చేరే అవకాశం ఉంది. ఇవన్నీ కలిపి చూస్తే 2027 ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు విరాట్ కోహ్లీ సుమారు 30 నుంచి 35 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికాలో జరగనున్న ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్ వరకు చేరితే మరో 13 మ్యాచ్‌లు తోడవుతాయి. ప్రపంచ కప్ ముగిసే వరకు అతడికి 30 నుంచి 35 వన్డేలు ఆడే అవకాశం ఉంటే, ప్రతి రెండున్నర మ్యాచ్‌లకు ఒక సెంచరీ చొప్పున సాధించాల్సి ఉంటుంది. ఇది అత్యంత కష్టమైన విషయమైనప్పటికీ, కోహ్లీ గతంలో నెలకొల్పిన ప్రమాణాలు, తిరుగులేని ప్రదర్శనను చూస్తే అసాధ్యమని చెప్పలేం. మొత్తంగా 2027 ప్రపంచ కప్ కోహ్లీ కెరీర్‌లో అత్యంత కీలక మలుపుగా మారనుంది. ఒకవైపు దేశానికి మరో ప్రపంచ కప్ అందించాలనే లక్ష్యం, మరోవైపు సచిన్ 100 అంతర్జాతీయ సెంచరీల రికార్డును అందుకోవాలనే అరుదైన అవకాశం ఉన్న ఈ సమయంలో కోహ్లీ తన బ్యాటింగ్ ప్రయాణాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తాడో చూడాలి.



జనవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్

వడోదర, ముంబై వేదికలుగా ఐదో సీజన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ జనవరి 14 నుంచి మొదలుకానుంది. వడోదర, ముంబై వేదికలుగా ఐదో సీజన్‌ను నిర్వహించనున్నట్లు బీసీసీఐ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వడోదరలోని బీసీఏ స్టేడియంలో 11 మ్యాచ్‌లు జరుగనుండగా ముంబైలోని బ్రబోర్న్ స్టేడియం లీగ్ దశలోని మిగిలిన 9 మ్యాచ్‌లతో పాటు నాకౌట్, ఫైనల్ పోరుకు ఆతిథ్యమివ్వనుంది. 14న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. ముంబై ఇండియన్స్‌తో జరిగే పోరుతో టోర్నీ ఆరంభం కానుంది. జనవరి 24 దాకా వడోదరలో సాగే ఈ టోర్నీ 26 నుంచి బ్రబోర్న్‌కు షిఫ్ట్ అవుతుంది. ఫిబ్రవరి 3 దాకా లీగ్ దశ మ్యాచ్‌లు జరుగనుండగా 5న ఎలిమినేటర్, 7న ఫైనల్ జరుగుతుంది.



ప్రిక్వార్టర్స్‌కు అన్మోల్, తన్వి

తొలిరౌండ్‌లోనే ప్రణయ్ ఔట్

యోసు (సౌత్‌కొరియా): బీడబ్ల్యూఎఫ్ కొరియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అన్మోల్ 21-19, 21-18తో రాచెల్ (కెనడా)ను ఓడించగా మరో పోరులో తన్వి 21-16, 12-21, 21-17తో మనామి సుయిజు (జపాన్)పై పోరాడి గెలిచింది. తదుపరి రౌండ్‌లో అన్మోల్.. జపాన్ స్టార్ షట్లర్ అకానె యమగుచితో తలపడనుండగా తన్వి సైతం జపాన్‌కే చెందిన ఐదో సీడ్ హినా అకెచితో ఆడనుంది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలు మోస్తున్న సీనియర్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్.. 15-21, 21-23తో యెు టె బిన్ (సౌత్ కొరియా) చేతిలో ఓడి తొలిరౌండ్‌కే ఇంటిబాట పట్టాడు.

పూజ ఆల్‌రౌండ్ షో

పుణె: మొదట బంతితో ప్రత్యర్థిని పడగొట్టి ఆ తర్వాత బ్యాట్‌తో అదరగొట్టిన వంక పూజ హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించింది. సీనియర్ విమెన్స్ క్రికెట్ టీ20 టోర్నీ సందర్భంగా పూజ ఆల్‌రౌండ్ షోతో హైదరాబాద్.. పుదుచ్చేరిపై ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. పూజ 4 వికెట్లతో చెలరేగగా మొదట బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి 133 రన్స్‌కే కుప్పకూలింది. ఛేదనలో ఆమె 41 బంతుల్లోనే అజేయంగా 55 రన్స్ చేసింది. ఈ టోర్నీలో నాలుగు వికెట్ల ప్రదర్శన చేయడం ఆమెకు ఇది మూడోసారి కావడం గమనార్హం.





ఆ క్రైమ్‌లో ఇరుక్కున్నా

'దొంగ నా కొడుకు' హీరోయిన్ సుష్మితా శెట్టి

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : స్టార్ హీరోలతో వందల కోట్ల భారీ బడ్జెట్ సినిమాలు నిర్మించే అగ్ర నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్'.. కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను కూడా ఎంతో ప్రోత్సహిస్తోంది. సరిగ్గా ఈ స్ట్రాటజీతోనే వాళ్ల బ్యానర్ నుంచి వస్తున్న తాజా క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, శ్రీను కంబాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంతో సుష్మితా శెట్టి హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. నవంబర్ 13న ఈ సినిమా థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో, తన క్యారెక్టర్ గురించి హీరోయిన్ సుష్మితా శెట్టి చెప్పిన ఆసక్తికర విషయాలు విశేషంగా నిలిచాయి. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్ వినగానే చాలా క్యాచీగా, ఫన్నీగా అనిపించిందని సుష్మితా తెలిపింది. ఈ సినిమాలో తన పాత్ర గురించి వివరిస్తూ.. "ఇందులో నా క్యారెక్టర్ చాలా క్యూట్ అండ్ బబ్లీగా ఉంటుంది. చెప్పాలంటే కొంచెం తింగరి పిల్ల క్యారెక్టర్. హీరో ఈశ్వర్ (మౌళి)ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తుంది. ఆ ప్రేమ కోసం ఎంతకైనా తెగిస్తుంది. తనను తాను చాలా స్మార్ట్ అనుకుంటుంది. కానీ, అదే అతి తెలివితో తెలియకుండానే చాలా ఇన్నోసెంట్‌గా ఒక క్రైమ్‌లో ఇన్వాల్వ్ అయిపోతుంది. నేను సీరియస్‌గా స్మార్ట్‌గా ఏదైనా చేయబోతే.. అది కాస్తా తెరపై ఫుల్ కామెడీగా వర్కవుట్ అవుతుంది" అంటూ తన పాత్రపై క్యూరియాసిటీని పెంచేసింది. తన మూలాలు కన్నడలో ఉన్నప్పటికీ, పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే అని సుష్మితా శెట్టి తెలిపింది. విదేశాల్లో చదువుకునే రోజుల నుంచే థియేటర్ ఆర్ట్స్ చేసిన సుష్మితకు.. దివంగత అందాల తార శ్రీదేవి అతిపెద్ద స్ఫూర్తి అట. డ్యాన్స్ ద్వారా పలికించే హావభావాలే తనను నటన వైపు నడిపించాయని ఆమె చెప్పుకొచ్చింది. ఇక టాలీవుడ్‌లో జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ ల డ్యాన్స్ అంటే తనకు ఎంతో ఇష్టమని మనసులోని మాట బయటపెట్టింది. ఈ సినిమాలో కూడా తను వేసిన ఒక డ్యాన్స్ నంబర్ ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుందని ధీమా వ్యక్తం చేసింది. వెండితెరపై లీడ్ హీరోయిన్‌గా ఇది తన మొదటి సినిమా అని, ఒక నటిగా తనను తాను బిగ్ స్క్రీన్‌పై చూసుకోవడానికి చాలా ఎక్సైటెడ్‌గా ఉన్నానని సుష్మితా తెలిపింది. తొలి సినిమాకే 'మైత్రీ మూవీ మేకర్స్' లాంటి పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని మురిసిపోయింది. కో-స్టార్ మౌళి చాలా టాలెంటెడ్ అని, దర్శకుడు శ్రీను కంబాలకు ఇది మొదటి సినిమా అయినా సెట్స్‌లో ఏమాత్రం టెన్షన్ లేకుండా చాలా కూల్‌గా సినిమాను తెరకెక్కించారని ఆమె కితాబిచ్చింది. సంగీత దర్శకుడు సింజిత్ అందించిన మ్యూజిక్ ఈ క్రైమ్ కామెడీకి ప్రధాన బలం అని సుష్మితా పేర్కొంది. భవిష్యత్తులో తనకు 'మహానటి' తరహాలో అన్ని ఎమోషన్స్ ఉన్న భారీ పాత్రలతో పాటు స్పోర్ట్స్, రొమాంటిక్ కామెడీ, హారర్ థ్రిల్లర్స్ చేయాలని ఉందని తన మనసులోని కోరికను బయటపెట్టింది. ప్రస్తుతం తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తున్న ఈ బ్యూటీ.. నవంబర్ 13న రాబోతున్న 'దొంగ నా కొడుకు' ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని గ్యారెంటీ ఇస్తోంది!



టాలీవుడ్‌ను విమర్శిస్తారా?

రాధికా ఆప్టే కామెంట్స్‌పై పాయల్ రాజ్‌పుత్ సంచలన కౌంటర్!


హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : తెలుగు చిత్ర పరిశ్రమపై నటి రాధికా ఆప్టే చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ఈ వివాదంపై తాజాగా బోల్డ్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. టాలీవుడ్‌ను విమర్శించే వారిపై తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేస్తూ దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. తాను గర్వించదగిన తెలుగు నటిని అని పాయల్ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసింది. ఒకప్పుడు ఏ ఇండస్ట్రీ అయితే మీకు పేరు, ప్రఖ్యాతులు ఇచ్చిందో.. ఏళ్ల తర్వాత అదే ఇండస్ట్రీ నుంచి అన్నీ పొంది ఇప్పుడు తప్పుగా మాట్లాడటం ఏమాత్రం ధైర్యం అనిపించుకోదని, అది కేవలం కృతఘ్నత మాత్రమే అవుతుందని పాయల్ రాజ్‌పుత్ తీవ్ర స్థాయిలో మండిపడింది. మీ కెరీర్‌ను ప్రారంభించి, మీకు నటనలో లైఫ్ ఇచ్చిన మొత్తం టాలీవుడ్ ఎకోసిస్టమ్‌ను ఏళ్ల తర్వాత నిందించడం ఎంతమాత్రం సరికాదని ఆమె చురకలంటించింది. "ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం టాలీవుడ్ మాత్రమే, నాకు అండగా నిలబడిన ఈ తెలుగు చిత్ర పరిశ్రమకు నేను ఎప్పటికీ అండగా నిలబడతాను" అని పాయల్ గర్వంగా ప్రకటించింది. తనకు లైఫ్ ఇచ్చిన ఇండస్ట్రీని ఎవరైనా పల్లెత్తు మాట అన్నా సహించేది లేదంటూ పాయల్ రాజ్‌పుత్ చేసిన ఈ సెన్సేషనల్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్‌గా మారింది. తెలుగు చిత్ర పరిశ్రమపై ఆమె చూపించిన ఈ అపారమైన అభిమానానికి నెటిజన్లు, సినీ ప్రియులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

నేటి తరానికి నచ్చేలా తీర్చిదిద్దిన దృశ్యకావ్యం!

రామాయణ

రాముడిగా రణ్‌బీర్ కపూర్.. రావణుడిగా యశ్ విశ్వరూపం

సీతగా సాయిపల్లవి ఆకట్టుకునే అభినయం



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : తరాలు, సాంకేతికత మారుతున్న కొద్దీ అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రామాయణం సినిమాగా తెరకెక్కుతూనే ఉంది. అందరికీ తెలిసిన వాల్మీకి రామాయణాన్ని మరోసారి అత్యున్నత సాంకేతిక హంగులతో దర్శకుడు నితీశ్ తివారీ తెరపైకి తీసుకొచ్చారు. మన సంస్కృతిలో భాగమైన ఇతిహాసాన్ని నేటి తరానికి మరింత సులువుగా, స్పష్టంగా అర్థమయ్యేలా చేరువ చేయాలన్న ప్రయత్నం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్ర కథ విషయానికి వస్తే, ముల్లోకాలపై ఆధిపత్యం కోసం దేవతలు, రాక్షసులకు మధ్య యుగాలుగా యుద్ధం కొనసాగుతుంటుంది. అసురుల సైన్యానికి రాకుమారి కైకసి నాయకత్వం వహిస్తుండగా, శ్రీ మహావిష్ణువు ఆశీర్వాద బలంతో దేవతలే పైచేయి సాధిస్తారు. లంకా నగరం దేవతల వశమై, పరిపాలన బాధ్యతలను కుబేరుడికి అప్పజెబుతారు. పరాజయ భారంతో రగిలిపోయిన కైకసి.. సంగీత శాస్త్రాలే ప్రపంచంగా గడుపుతున్న తన కుమారుడు దశాననుడి దగ్గరకు వెళ్లి అసురజాతికి ఎదురుతుణ్ణ అవమానాల గురించి చెబుతుంది. అది విన్న దశానన కఠోరమైన తపస్సు చేసి, అటు అసురులు, ఇటు దేవతల చేతిలో తనకు మరణం ఉండకూడదని బ్రహ్మదేవుడు ప్రసాదించిన వర గర్వంతో లంకా నగరంపై విరుచుకుపడతాడు. ముల్లోకాలకూ తానే అధిపతినని ప్రకటించుకున్న ఆ దశాననుడే రావణుడు. రావణ పట్టాభిషేకం తర్వాత లంకలో చోటు చేసుకున్న పరిణామాలు, దశరథుడి పాలనలోని అయోధ్యలో జరిగిన సంఘటనలు, శ్రీరాముడు పట్టాభిషిక్తుడు కావల్సిన సమయంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. సినిమా అనుభూతి పరంగా, సీతాపహరణం వరకు సాగే ఈ తొలి భాగం ప్రేక్షకుల్ని పూర్తిగా కథా ప్రపంచంలో మమేకం చేస్తుంది. హనుమంతుడి పరిచయం, రామరావణ యుద్ధంతో రాబోయే భాగంపై అంచనాలను పెంచుతుంది. పాత్రలను చూపించడంలో దర్శకుడు ఎలాంటి ప్రయోగాల జోలికి వెళ్లకుండా, మనదైన ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాల కన్నా ఘనంగా, కళ్ళు చెదిరే విజువల్స్‌తో తెరపై ఆవిష్కరించారు. రావణుడి బాల్యం నేపథ్యం ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా మార్చింది. శ్రీరాముడి జననం, బాల్యం, వీరత్వం వంటి ఘట్టాలు ప్రేక్షకుడిని లీనం చేస్తాయి. అసురులైన తాటకి, సుబాహులతో శ్రీరాముడు అడవిలో చేసే యుద్ధం, స్వయంవరం, సీతారాముల వివాహం, ఆపై దశరథుడు, కైకేయి, శ్రీరాముడి మధ్య సాగే సన్నివేశాలు భావోద్వేగాలను పక్కాగా ఆవిష్కరిస్తాయి. విరామం తర్వాత వనవాసం చుట్టూ సాగే ప్రయాణంలో దట్టమైన అడవుల్లో జరిగే యుద్ధ ఎపిసోడ్, రావణుడు మరియు విద్యుత్‌జిహ్వుడు మధ్య సన్నివేశాలు, శూర్పణఖ ఘట్టం, సీతాపహరణ సమయాన జటాయువు మరియు రావణుడి మధ్య పోరాటం ద్వితీయార్ధానికి హైలైట్‌గా నిలిచాయి. పురాణ గాథ అయినప్పటికీ, ఘనమైన విజువల్ హంగుల కారణంగా అద్భుతమైన ఫాంటసీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. నటీనటుల ప్రతిభను పరిశీలిస్తే, శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ ఎంతో ఒదిగిపోయి నటించారు. ఆ పాత్రకు తగినట్టుగా హుందాగా కనిపిస్తూనే భావోద్వేగాలను అద్భుతంగా పండించారు. రావణుడిగా యశ్ వంద శాతం న్యాయం చేశారు. పరిచయ సన్నివేశాలతోనే సినిమాపై బలమైన ప్రభావం చూపించారు. సీతగా సాయిపల్లవి అభినయం కట్టిపడేస్తుంది. లక్ష్మణుడిగా రవి దూబే, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ తమ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. డీఎన్‌జీ అందించిన విజువల్ ఎఫెక్ట్స్, ఏఆర్ రెహమాన్ మరియు హన్స్ జిమ్మర్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ఈ చిత్రంలో విజువల్స్, నటీనటుల అభినయం, యాక్షన్ ఘట్టాలు అత్యంత ప్రధాన బలాలుగా నిలిచాయి. అక్కడక్కడ కథా సన్నివేశాలు కొద్దిగా నెమ్మదిగా సాగినప్పటికీ, మొత్తంగా చూస్తే మన పురాణ గాథలను తెరపై ఎంత ఘనంగా ఆవిష్కరించవచ్చో చాటిచెప్పిన అద్భుత దృశ్యకావ్యం ఈ 'రామాయణ'.

'ధర్మన్' పటాకా



అదిరిపోయే స్టెప్పులతో అలరించడమే కాదు తనదైన నటనతోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన నటించే అవకాశాల్ని అందిపుచ్చుకుంటున్న నాయికీమె. తమిళంతో పాటు హిందీలో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి మరో అగ్ర హీరో సినిమా చేరింది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో.. అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న 'ధర్మన్' చిత్రంలో ఆమె నటించనున్నారు. నయనతార, రామ్, సిమ్రాన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తోన్న ఈ సినిమాలో తాజాగా శ్రీలీల చేరినట్టు అధికారికంగా తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. "ఆమెలో ఆ మెరుపు ఉంది, ఆమెలో ఆ పటాకా ఉంది, అందాల శ్రీలీలకు ధర్మన్‌లోకి స్వాగతం" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రాన్ని కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థపై ఆర్.మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతమందిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం అజిత్ కుమార్ ప్రధాన పాత్రలో వస్తున్న 'డేర్ డెవిల్', ధనుష్ 'ఓం' చిత్రాల్లోనూ నటిస్తున్నారు.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

ధాన్యం కొనుగోల్లను వెంటనే ప్రారంభించాలి

- **తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా.**

వలిగొండ నవంబర్ 05 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఎమ్మెల్యేలు ప్రచార ఆర్భాటంగా ప్రారంభించిన ధాన్యాన్ని మాత్రం నేటికీ కొనుగోలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని దీంతో అనేక మంది రైతులు ఇప్పటికే 40 శాతం మేరకు ప్రైవేటు వ్యాపారస్తులకు కారు చౌకగా అమ్ముకుంటున్నారని దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడడంతో పాటు రైతాంగం మోసపోతున్నారని వెంటనే ధాన్యం కొనుగోల్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకోకుండా గిట్టుబాటు ధర కోసం స్థానిక ఐకెపి సింగల్ విండో కేంద్రాలలో ధాన్యాన్ని పోసిన రైతులు కొనుగోళ్ళు ప్రారంభం కాకపోవడంతో ఎప్పుడు వర్షం వస్తుందో అర్థం కాని పరిస్థితులు ఉండటంతో రైతులు తమ ధాన్యం తడిసిపోతుందని తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోపక్క ప్రభుత్వం కొనుగోళ్ళు ప్రారంభించక పోవడంతో మార్కెట్లలో పోసిన ధాన్యాన్ని తిరిగి ప్రైవేటు వ్యాపారస్తులకు వ్యక్తులకు అమ్ముకోవడానికి మార్కెట్ల నుండి తీసుకుపోతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం సివిల్ సప్లై శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం అందుబాటులో ఉన్న జూనియర్ అసిస్టెంట్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య,కల్మూరి ముత్యాలు, కవిడే సురేష్,దుబ్బ లింగం,నాయకులు గర్దాసు నరసింహ,మంగ బాలయ్య,కొండూరు సత్తయ్య,వేముల లక్ష్మయ్య, నాగరాజు,నరేందర్,తదితరులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లవద్దు

- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**
- **మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీముల పేరుతో అధిక లాభాల ఆశ చూపే మోసగాళ్ల పట్ల జాగ్రత్త**
- **ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాలకు అడ్డుకట్ట.**

నారాయణపేట, నవంబర్,05(సమయం న్యూస్)



ప్రజల బలహీనతలు, అత్యాశను ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పద్ధతుల్లో ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా మల్టీ లెవల్ మార్కెటింగ్ (MLM), గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే మోసపూరిత స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఒక ప్రకటనలో తెలిపారు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని, తమ కింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పిస్తే భారీ కమీషన్లు, రివార్డులు, పాయింట్లు అందిస్తామని కొందరు మోసగాళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఇలాంటి గొలుసుకట్టు వ్యాపారాల ద్వారా ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించి, చివరకు పెట్టుబడి పెట్టిన వారిని ఆర్థికంగా నష్టపరుస్తున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకొని మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తూ అమాయక ప్రజలను తమ వలలోకి లాగుతున్నారని తెలిపారు. విదేశాల్లో ఉంటూ కొందరు ముఠాలుగా ఏర్పడి ఈ తరహా కార్యకలాపాలను నిర్వహిస్తూ, భారీ లాభాలు, లగ్జరీ కార్లు, విదేశీ పర్యటనలు వంటి ఆశలు చూపించి ప్రజలను పెట్టుబడులు పెట్టేలా ప్రలోభపెడుతున్నారని హెచ్చరించారు. గొలుసుకట్టు వ్యాపారాల్లో ముందుగా చేరిన కొంతమందికి లాభాలు వచ్చినట్లు చూపించి, ఆ తర్వాత చేరేవారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తారని, చివరికి అధిక సంఖ్యలో ప్రజలు పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుందని ఎస్పీ వివరించారు. కాబట్టి ఇలాంటి నెట్‌వర్క్ మార్కెటింగ్ స్కీముల్లో ఎవరూ చేరవద్దని, ఆయా సంస్థల నిర్వాహకులు నిర్వహించే ఆకర్షణీయమైన సభలు, సమావేశాలకు వెళ్లి వారి మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు.

ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే హామీలను నమ్మవద్దు.ఎక్కువ మంది సభ్యులను చేర్పిస్తే కమీషన్లు, రివార్డులు ఇస్తామనే ప్రలోభాలకు గురికావద్దు.సంస్థ విశ్వసనీయత,చట్టబద్ధతను పూర్తిగా పరిశీలించకుండా ఎలాంటి పెట్టుబడులు పెట్టవద్దు.సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయమైన, అనుమానాస్పద ప్రకటనలను నమ్మవద్దు.గుర్తుతెలియని వ్యక్తులు పంపే వెబ్ లింకులు, APK ఫైల్స్‌ను క్లిక్ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయడం చేయవద్దు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, OTPలు ఎవరికీ వెల్లడించవద్దు.ప్రజలు అత్యాశకు పోయి కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోవద్దని,అనుమానాస్పద పెట్టుబడి పథకాలు, ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, తద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

వరద విపత్తు పై అధికారుల చర్యలకు అభినందనలు

- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఖమ్మం, నవంబర్ 5 : (సమయం న్యూస్)



వరద విపత్తుపై అధికారులు సమన్వయంతో తీసుకున్న చర్యలు, ప్రాణనష్టం లేకుండా చేపట్టిన చర్యలను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం సింగరేణి కాలరీస్ గెస్ట్ హౌజ్ లో బేతుపల్లి వరద సహాయక చర్యలు, వరద ముంపు నష్టాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాత్రి సమయంలో ముంపు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించడానికి వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి రక్షించారన్నారు. బోట్లు బోల్తా పడినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినప్పటికీ, రాత్రి నుంచి ఉదయం వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా అందరినీ సురక్షితంగా కాపాడటం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి, జరుగుతున్న ప్రచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారన్నారు. కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షించడం వలన పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. 2023 డిసెంబర్‌లో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 2024 ఆగస్టు చివరిలో మున్నేరు వాగు ఊహించని రీతిలో సుమారు 7677 అడుగుల ఎత్తుతో ప్రవహించినప్పుడు భారీ నష్టం వాటిల్లిందని, అప్పట్లో ఎస్డీఆర్ఎఫ్ దగ్గర తగిన పరికరాలు లేకపోవడాన్ని గమనించిన ముఖ్యమంత్రి, మంత్రులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విపత్తు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పోలీసు శాఖ నుంచి 1200 మందిని, ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి 700 మందిని ఎంపిక చేసి ఎస్డీఆర్ఎఫ్‌ను పటిష్టం చేయడంతో పాటు, మొత్తం 1,900 మంది సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చామన్నారు. సుమారు రూ. 260 270 కోట్ల వ్యయంతో అత్యుత్తమ అత్యాధునిక పరికరాలను ఎస్డీఆర్ఎఫ్ కు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఏ మూలన విపత్తు వచ్చినా 45 నుండి 50 నిమిషాల లోపు సహాయక చర్యలు అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రాణనష్టం జరగకుండా అహర్నిశలు శ్రమించిన అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ప్రజాప్రతినిధులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. విపత్తు సంభవించిన వెంటనే కేవలం 30 నుంచి 35 నిమిషాల వ్యవధిలోనే రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గం, సత్తుపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. కొన్ని ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు తెగడం, చెరువులు పొంగిపొర్లడం వల్ల కింద ఉన్న వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయనారు. మల్లెపూవు వాగు ప్రవహించడం వల్ల డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. రోడ్లపైకి చెత్తాచెదారం, వరద నీరు చేరడం వల్ల కొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్లకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. విపత్తు ప్రాతిపదికన రానున్న 23 రోజుల్లోగా నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్‌ను ప్రభుత్వానికి సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించడం జరిగిందన్నారు.గత 36 గంటలుగా నిరంతరం శ్రమించి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విపత్తు నిర్వహణలో కష్టపడిన ఎస్డీఆర్ఎఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సిబ్బందిలో ఎవరికైనా ఇళ్లు లేని పక్షంలో, వారికి ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడతామని, అర్హులైన వారి జాబితాను పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ, విద్యుత్, తాగునీరు శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల వారీగా జరిగిన వాస్తవ నష్టాలపై తక్షణ నివేదికను రానున్న 23 రోజుల్లో అందజేయాలని మంత్రి ఆదేశించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితులలో సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద చిక్కుకున్న మత్స్యకారులను జిల్లా యంత్రాంగం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల అప్రమత్తతతో పూర్తిగా రక్షించడం జరిగిందన్నారు. చెరువు నీటి మట్టం, ప్రవాహ ఉధృతి సమయంలో సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో 8 మంది మత్స్యకారులు తెప్ప బోటును వేసుకుని చెరువులోకి వెళ్లడం జరిగిందని, వరద ఉధృతి పెరగడంతో వారు అక్కడే ఇరుక్కుపోవడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి, తక్షణ సహాయక చర్యల కోసం అందరినీ సమాయత్తం చేశామన్నారు. అప్పటికే భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని ఇక్కడికి తక్షణమే రప్పించగా, వారు కేవలం 25 నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. మొదటి బోటు ద్వారా వెళ్లి, ఈత రాని ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చారున్నారు. ఆ తర్వాత రెండవ బోటు సహాయంతో మిగతా వారిని రక్షించడానికి వెళ్లిన సమయంలో, వరద ప్రవాహం మరింత పెరగడంతో రెండు బోట్లు బ్యాలెన్స్ కోల్పోయి ఎస్డీఆర్ఎఫ్ బృందం కూడా నీటిలో పడిపోవడం జరిగిందని తెలిపారు. తక్షణమే అప్రమత్తమైన యంత్రాంగం విజయవాడ నుండి కెప్టెన్ కిరణ్, నీరజ్ ల నేతృత్వంలోని ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించామని తెలిపారు. పోలీసు శాఖ, ఇతర యంత్రాంగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ లొకేషన్ ట్రేసింగ్ ఉపయోగించి రాత్రి సమయంలో కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాకు రెడ్ అలర్ట్ నేపథ్యంలో నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమై, సహాయక చర్యలను వేగవంతం చేసిందని తెలిపారు. గతంలో భద్రాచలం డివిజన్ చెర్ల, దుమ్ముగూడెం, గోదావరి పరివాహక ప్రాంతాల పరిధిలో వరద ముప్పు ఎక్కువగా ఉండేదని, అయితే ఈసారి కొత్తగూడెం డివిజన్‌లో ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ వర్షపాతం నమోదైందని అన్నారు.ముల్కలపల్లి సమీపంలో ఐటీడీఏ వైపు వెళ్తుండగా వరదలో చిక్కుకుని, చెట్టుపై తలదాచుకున్న 40 సంవత్సరాల మహిళను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షించాయన్నారు. ముల్కలపల్లిలోనే వాగు ప్రవాహం ఒక్కసారిగా పెరిగిన వేళ, ఒక 20 ఏళ్ల యువకుడు ప్రాణాపాయ స్థితిలో చెట్టుపైకి ఎక్కగా, అతనికి లైఫ్ జాకెట్లు, రోప్‌లు, డ్రోన్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారన్నారు. దేవాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లిన 11 మంది గిరిజనులు వరద నీటిలో చిక్కుకోగా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని వారందరినీ క్షేమంగా బయటకు తరలించాయన్నారు. తదనంతరం అదే బృందం సత్తుపల్లిలోని అత్యవసర ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ మాట్లాడుతూ, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా విజయవంతంగా సహాయక చర్యలు పూర్తి చేశాయన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అకస్మాత్తుగా ఎదురైన విపత్తును సమన్వయంతో, సాహసంతో ఎదుర్కొని అందరినీ రక్షించారాని, అధికారులు, సహాయక బృందాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రెవెన్యూ, పోలీస్, విపత్తు నిర్వహణ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం లేకుండా చూశారన్నారు. వరదతో జరిగిన పంట నష్టాన్ని అందించాలన్నారు. విపత్తులో పాల్గొన్న వారిని అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, ఉమ్మడి జిల్లా శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దూడల ఆరోగ్య పరిరక్షణకు నట్టల నివారణ మందుల పంపిణీ

- **కొల్లూరులో 55 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ**

ఆలేరు, నవంబర్ 5(సమయం న్యూస్)



ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం దూడల నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జనగామ సంధ్యారాణి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం 55 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులను అందజేశారు.ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్ మాట్లాడుతూ దూడల ఆరోగ్య పరిరక్షణలో నట్టల నివారణ మందులు ఎంతో కీలకమని తెలిపారు. దూడల్లో నట్టల సమస్య వల్ల ఎదుగుదల మందగించడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. రైతులు నిర్ణీత సమయాల్లో పశువైద్యుల సూచనల మేరకు నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా దూడలు ఆరోగ్యంగా పెరిగి, భవిష్యత్తులో పశుసంపద అభివృద్ధికి దోహదపడతాయని సూచించారు.పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గాజుల దశరథ, వార్డు సభ్యులు, మదర్ డెయిరీ చైర్మన్ ఐల కృష్ణ, పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్, జేవీఓ నరసింహ, గోపాలమిత్రులు సుధాకర్, శ్రీకాంత్, గోపి, గ్రామ రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

పరిగి ప్రభుత్వ ఆసుపత్రి డైనేజీ సమస్యకు త్వరలో పరిష్కరిస్తాం

- **పరిగి మున్సిపల్ కమిషనర్ మల్లేశం**

పరిగి మున్సిపల్, 05,నవంబర్ (సమయం న్యూస్)

పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను త్వరలోనే శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ కే. మల్లేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడ నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్వయంగా పరిశీలించారు.ఆసుపత్రి ఆవరణలో డ్రైనేజీ సమస్య కారణంగా రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి, సమస్యకు గల ప్రధాన కారణాలు, తీవ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచి, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్, మున్సిపాలిటీ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలలో కమ్యూనిటీ మీడియేషన్

- **సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన**

జగిత్యాల: నవంబర్,5(సమయం న్యూస్)

చిన్నచిన్న కుటుంబ, సామాజిక, స్థానిక వివాదాలను కోర్టులకు వెళ్లకుండా పరస్పర అంగీకారంతో కమ్యూనిటీ మీడియేషన్ ద్వారా పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి సరిత మట్ట తెలిపారు.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో కమ్యూనిటీ మీడియేషన్, సీనియర్ సిటిజన్స్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల హక్కులు, రక్షణ, పోషణ, సంక్షేమం కోసం చట్టంలో ఉన్న నిబంధనలను వివరించారు. హక్కులకు భంగం కలిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సి.హెచ్. అనురాధ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



పాఠ్యాంశాలను నిత్యం సాధన చేయాలి

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 5:(సమయం న్యూస్)

విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగా చదువుతూ, నిత్యం చదవడం-రాయడం సాధన చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.కోనరావుపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. వంటగదిలో మెనూ, కూరగాయలు, బియ్యం, పప్పుల నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. తమ లక్ష్యాలను చేరుకుని ఉద్యోగం లేదా స్వయం ఉపాధిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, జీసీడీవో పాల్గొన్నారు.



గుస్సాడి దండారి వేడుకలు గిరిజన సంస్కృతికి ప్రతీక

ఆదిలాబాద్, నవంబర్ 5:,(సమయం న్యూస్,,)

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుస్సాడి దండారి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో నిర్వహించిన గుస్సాడి దండారి వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరంద్, ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ప్రజలు శాంతిభద్రతలను పాటిస్తూ పండుగను సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు.




కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధికి సమీకృత ప్రణాళిక

- **కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధికి సమీకృత ప్రణాళిక**

హైదరాబాద్, నవంబర్ 5:,,(సమయం న్యూస్)

కోర్ అర్బన్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి సమీకృత ప్రణాళిక రూపొందించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించింది. నానక్‌రామ్‌గూడలో హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది.చెరువుల పరిరక్షణ, పర్యావరణం, ట్రాఫిక్,రహదారి భద్రత, విపత్తుల నిర్వహణ, ప్రజా సేవలు, విద్యుత్ వాహనాల మౌలిక వసతులు,వారసత్వసంపద తదితర అంశాలపై చర్చించారు. సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలు, హెచ్ఎండీఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ప్రభుత్వ సేవలు, చెల్లింపులు,ఫిర్యాదులకుఒకేవేదికగా 'క్యూర్ వన్' సమగ్ర డిజిటల్ అప్లికేషన్‌ను రూపొందించే అంశాన్ని కూడా పరిశీలించారు.



పట్టబద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు హెల్ప్ డెస్క్

- **సద్వినియోగం చేసుకోండి.**
- **తహసిల్దార్ జి. దశరథ నాయక్.**

వలిగొండ నవంబర్ 05 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయం నందు పట్టుబత్తుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడినది కావున తేదీ 31.10. 2023 నాటికి డిగ్రీ విద్యార్హత పూర్తిచేసి స్థానికంగా ఓటు హక్కు కలిగి ఉన్న అరులైన పట్టభద్రులు ఈ హెల్ప్ డెస్క్ ను సంప్రదించి ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలు మరియు సహాయాన్ని పొందవలసిందిగా స్థానిక తహసిల్దార్ దశరథ నాయక్ కోరడమైనది.

సరిహద్దుల్లో సేవలకు.. సైనికుడా 'సలాం'

- సరిహద్దుల వీరుడికి వరంగల్ వందనం.. జవాన్ రాజేష్‌కు ఘన సత్కారం
- దేశం కోసం పాతికేళ్ల త్యాగం.. బీఎస్ఎఫ్ జవాన్ ను ఆత్మీయంగా సన్మానించిన 'గంట రవికుమార్'
- బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేడుక

కాశిబుగ్గ/వరంగల్, నవంబర్ 5 (సమయం న్యూస్)

దేశ సరిహద్దుల్లో పాతికేళ్ల పాటు అహర్నిశలు సేవలందించి, దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన బీఎస్ఎఫ్ జవాన్ వంగరి రాజేష్‌కు ఘన సన్మానం జరిగింది. వరంగల్‌లోని కాశిబుగ్గకు చెందిన రాజేష్ దేశ భద్రత కోసం అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వరంగల్ నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ రాజేష్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి కాపలా కాస్తూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్న సైనికులను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. రాజేష్ వంటి జవాన్ల త్యాగాలు, నిరంతర సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ రక్షణ కోసం జీవితంలోని 25 ఏళ్లను అంకితం చేసిన జవాన్‌ను గౌరవించుకోవడం తమ కమిటీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ధార్మిక జిల్లా కన్వీనర్ మడిపల్లి నాగరాజు గౌడ్, డాక్టర్ కొంతం కృష్ణ, భారతీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రోగొల్ల భరత్ వీర్ పాల్గొన్నారు.



బాలల హక్కుల వారోత్సవాలు

- బాలల హక్కుల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

హైదరాబాద్, నవంబర్ 5:(సమయం న్యూస్)



నవంబర్ 14 నుంచి 20 వరకు బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 16న 'పిల్లల ప్రజావాణి' నిర్వహించనున్నట్లు చెప్పారు.పిల్లలు విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, సంక్షేమ పథకాలు తదితర సమస్యలను ప్రజావాణిలో నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, వేధింపులు, దోపిడీ వంటి సమస్యలపై కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

శాశ్వత అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

- మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్5(సమయం న్యూస్)

జిల్లాలో పీబీజీ రామ్ జి పథకం ద్వారా తాత్కాలిక పనులకు బదులుగా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మురసు తుపానుతో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, విద్యుత్ వ్యవస్థను త్వరగా పునరుద్ధరించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. భద్రాచలం-వెంకటాపురం రహదారి పనులను వేగవంతం చేయాలని, జిల్లాలోని పట్టణాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.



కుల వివక్షత లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- సామాజిక సమరసతా వేదిక అఖిల భారత కార్యదర్శి అప్పాల ప్రసాద్

ఆలేరు, నవంబర్ 05(సమయం న్యూస్)

డా.బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల వివక్షత లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక సమరసతా వేదిక సాంస్కృతిక విభాగం అఖిల భారత కార్యదర్శి, తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ పిలుపునిచ్చారు. సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలేరు పట్టణంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో ఆలేరు, పరిసర గ్రామాల గ్రామ పెద్దలు, కుల పెద్దల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాల వారు పరస్పర ప్రేమ, సహకారంతో ఐక్యంగా జీవించాలని, దేవాలయాల్లో అందరికీ సమాన ప్రవేశం, అందరికీ ఒకే స్మశానవాటిక ఉండాలని ఆకాంక్షించారు. సంత్ రవిదాస్ చూపిన మార్గంలో నడుస్తూ సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రాంత కళా ప్రముఖ్ బండిరాజుల శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమరసతా వేదిక జిల్లా కార్యదర్శి కొంతం వెంకటేశ్వర ప్రసాద్, ఆలేరు ఖండ కన్వీనర్ దూడల వెంకటేశ్, కమటం రమేశ్, కీర్తి వీరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, కుల పెద్దలను ఘనంగా సన్మానించారు.



కరువు పరిస్థితుల్లో రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలి

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, నవంబర్ 5(సమయం న్యూస్.,)

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అర్హులైన రైతులకు బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. పంట రుణాలను పునర్వ్యవస్థీకరించి రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించాలని ఆదేశించారు.తీవ్ర కరువు మండలాల్లో 12 నెలల మారటోరియంతో మొత్తం 60 నెలలు, మధ్యస్థ కరువు మండలాల్లో 36 నెలల వరకు రుణ చెల్లింపు గడువు పొడిగింపు సదుపాయం ఉందన్నారు. కరువు సమయంలో రుణాల చెల్లింపుల కోసం రైతులపై ఒత్తిడి చేయవద్దని బ్యాంకర్లకు సూచించారు.అర్హులైన రైతులకు కొత్త రుణాలు అందించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు ఆర్థిక సహకారం అందించాలని, రుణ పునర్వ్యవస్థీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి

- బిందు, తుంపర సేద్యంతో నీటి వృథాను అరికట్టి అధిక దిగుబడులు సాధించవచ్చు
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి పి. సోమేశ్వరరావు

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 5:



ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యత తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి పి. సోమేశ్వరరావు సూచించారు ఈ సందర్భంగా ఆయన కోహీర్, జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లోని రైతుల పొలాలను సందర్శించి, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బిందు సేద్యం, తుంపర సేద్యం యూనిట్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగం, వాటి ద్వారా రైతులు పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిందు, తుంపర సేద్య పద్ధతుల ద్వారా పంటలకు అవసరమైన నీటిని సరైన సమయంలో, తగిన పరిమాణంలో అందించవచ్చని తెలిపారు. తద్వారా నీటి వృథాను గణనీయంగా తగ్గించడంతో పాటు, తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితుల్లో సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారుక్షేత్రస్థాయిలో రైతులు ఆధునిక సూక్ష్మ సేద్య పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రైతు నీటి పొదుపు పద్ధతులను అనుసరిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని తెలిపారు.ఈ క్షేత్రస్థాయి పర్యటనలో EPC మహీంద్ర ఇరిగేషన్ DCO జైపాల్ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అన్నప్రాశన వేడుకలో ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'

- గుంటూరుపల్లిలో పాశం హర్ష–శివాని దంపతుల కుమారుడి అన్నప్రాశన వేడుక
- బుడిబుడి అడుగులకు పెద్దల ఆశీస్సులు.. శివ్ కార్తివన్ అన్నప్రాశన వేడుకలో ప్రజాప్రతినిధులు

చిట్యాల, నవంబర్ 5 (సమయం న్యూస్)



మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో పాశం హర్ష-శివాని దంపతుల కుమారుడు చిన్నారి పాశం శ్రీ శివ్ కార్తివన్ అన్నప్రాశన వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారికి ఆశీస్సులు అందజేశారు.భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్‌లతో కలిసి వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి శివ్ కార్తివన్ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు. పాశం హర్ష-శివాని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆశించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వేడుకలో కొంత సమయం గడిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, 14వ డివిజన్ అధ్యక్షుడు ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, హనుమకొండ జిల్లా జేబీఎం చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, కలైడ పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, పీఏసీఎస్ చైర్మన్ వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ ఫైనాన్స్ ముఠా భరతం పట్టిన పోలీసులుమరో నలుగురి అరెస్ట్

- ఏడుగురికి సంకెళ్లు
- రుణాల పేరుతో అధిక వడ్డీల వసూళ్లు, బెదిరింపులతో దోపిడీ.. రెండు కార్లు, 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు స్వాధీనం

మల్కాజిగిరి సమయం



అక్రమ ఫైనాన్స్ ముసుగులో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ముఠాపై మల్కాజిగిరి పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్, ఎల్‌బీనగర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో మరో నలుగురు నిందితులు పట్టుబడ్డారు. గత నెల 26న ముగ్గురిని అరెస్టు చేయగా, తాజా అరెస్టులతో మొత్తం ఏడుగురు పోలీసుల అదుపులోకి వచ్చారు. ఈ ముఠాతో సంబంధం ఉన్న మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఎల్‌బీనగర్, నేరేడ్‌మెట్, కీసర పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన నాలుగు కేసుల దర్యాప్తులో ఈ ముఠా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పెద్ద మొత్తంలో రుణాలు ఇప్పిస్తామంటూ నమ్మించి ముందస్తు వడ్డీ పేరుతో డబ్బులు వసూలు చేయడం, ఇచ్చిన మొత్తానికి మించి ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు తీసుకోవడం, అనంతరం బాధితులను బెదిరించి మరింత డబ్బు గుంజడం ముఠా ప్రధాన నేర విధానంగా పోలీసులు గుర్తించారు.మధ్యవర్తుల ద్వారా వల.. అప్పుల పేరుతో దోపిడీపోలీసుల వివరాల ప్రకారం.. ముఠా సభ్యులు ఫైనాన్షియర్లు, మధ్యవర్తుల సహకారంతో వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులను గుర్తించి పెద్ద మొత్తంలో రుణాలు ఇప్పిస్తామని నమ్మించేవారు. రుణం మంజూరుకు ముందే అధిక మొత్తంలో వడ్డీని మినహాయించడంతో పాటు, కొంత మొత్తం మాత్రమే చెల్లించి మరింత పెద్ద రుణం ఇప్పిస్తామంటూ అదనంగా డబ్బులు వసూలు చేసేవారు.అసలు ఇచ్చిన రుణం కంటే అనేక రెట్లు ఎక్కువ మొత్తాలకు ప్రామిసరీ నోట్లు, బాండ్లు, ఖాళీ సంతకం చేసిన చెక్కులను తీసుకునేవారు. బాధితులు అప్పు తీర్చిన తర్వాత కూడా ఆర్థిక పత్రాలను తిరిగి ఇవ్వకుండా అదనపు డబ్బులు డిమాండ్ చేసేవారు. తమ అక్రమ వసూళ్లను ప్రశ్నించినవారిని క్రిమినల్ కేసులు పెడతామని, శారీరకంగా హాని చేస్తామని బెదిరింపులకు దిగేవారు.వృద్ధ మహిళా వైద్యురాలినీ వదలని వైనంఏఐ ఆధారిత క్యాన్సర్ గుర్తింపు యంత్రం కొనుగోలు చేయాలనుకున్న ఓ వృద్ధ మహిళా వైద్యురాలికి ఆర్థిక సహాయం చేస్తామని నమ్మించి మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె నుంచి డబ్బులు, ఆర్థిక పత్రాలు తీసుకోవడంతో పాటు స్కోడా కారు, టయోటా ఇన్నోవా హైక్రాస్ వాహనాలను బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు, డ్రైవర్, అతని స్నేహితుడు, పదవీ విరమణ చేసిన పశుసంవర్ధక శాఖ ఉద్యోగి సైతం ఈ ముఠా వేధింపులు, ఆర్థిక దోపిడీకి గురైనట్లు దర్యాప్తులో వెల్లడైంది.తాజాగా పట్టుబడిన నలుగురునవంబర్ 5న అరెస్టయిన వారిలో కుంబం నాగమ్మ (48), కందెల గంగమ్మ (45), కందెల మంగమ్మ అలియాస్ రాణి (36), అడుల్ల అనూష (32) ఉన్నారు. వీరిలో నాగమ్మ, గంగమ్మ కూలీ పనులు చేస్తుండగా, మంగమ్మ హెయిర్ వ్యాపారం, అనూష రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో ముగ్గురి అరెస్ట్అక్టోబర్ 26న కందెల శివకుమార్ అలియాస్ వరుణ్ (24), వగ్గిగిరి ఇంద్రమ్మ అలియాస్ ఇంద్ర, లక్ష్మి, లత, అనిత (38), గైక్వాడ స్వప్న (32)లను పోలీసులు అరెస్టు చేశారు.రెండు కార్లు, రూ.47,690 నగదు స్వాధీనంనిందితుల నుంచి టయోటా ఇన్నోవా హైక్రాస్, స్కోడా కారుతో పాటు 12 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుంబం నాగమ్మ వద్ద రూ.33,010, కందెల గంగమ్మ వద్ద రూ.14,680 నగదు లభించింది. వీటితో పాటు రెండు తెలంగాణ పట్టాదారు పాస్ పుస్తకాలు, 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు, రెండు సేల్ డీడ్లను స్వాధీనం చేసుకున్నారు.మరో 20 మంది బాధితుల వివరాలపై ఆరాఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఏడుగురు బాధితులను గుర్తించి విచారించినట్లు పోలీసులు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో మరో 20 మంది సంభావ్య బాధితుల వివరాలను పరిశీలిస్తున్నారు. ముఠాతో సంబంధం ఉన్న మరో నలుగురి కోసం గాలింపు కొనసాగుతోంది.నిందితుల నేర చరిత్ర ఆధారంగా అవసరమైన చోట రౌడీ షీట్లు తెరిచామని, చట్టపరంగా తగిన సందర్భాల్లోపీడీ యాక్ట్ ప్రయోగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ కోసం నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకోనున్నట్లు తెలిపారు.అక్రమ ఫైనాన్షియర్లకు పోలీసుల హెచ్చరికఅధిక వడ్డీల పేరుతో అక్రమ రుణాలు ఇవ్వడం, బలవంతపు వసూళ్లకు పాల్పడటం, బెదిరింపులకు దిగడం, సంతకం చేసిన పత్రాలను దుర్వినియోగం చేయడం, ఆస్తులు, వాహనాలను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.రుణాలు తీసుకునేవారు అప్రమత్తంగా ఉండాలిప్రైవేట్ ఫైనాన్షియర్లు, అనధికార వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బాండ్లపై సంతకాలు చేయవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు, అనధికార ఆన్‌లైన్ రుణ సంస్థలు, బ్రోకర్లకు డబ్బులు బదిలీ చేయవద్దని సూచించారు. ప్రతి లావాదేవీకి సరైన పత్రాలు, రసీదులు తీసుకోవాలని కోరారు. ఈ ముఠా చేతిలో మోసపోయినవారు, బెదిరింపులకు గురైనవారు సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఆపరేషన్మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, అదనపు డీసీపీ ఎం.డి. షకీర్ హుస్సేన్, ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ బి. రవీందర్ రెడ్డి, ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశం, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి తదితరులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

- నవంబర్ 6 చివరి తేదీ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

ఆలేరు, నవంబర్ 05(సమయం న్యూస్)



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీజేవైఎం యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు పేరపు ఆనంద్ కోరారు. ఈ నెల 6వ తేదీ ఓటరు నమోదు చేసుకోవడానికి చివరి తేదీ కావడంతో ఆలేరు పట్టణంలోని మల్లన్న మిల్క్ పార్లర్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని, రాజీవ్ యువ వికాసం కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేటు గురుకుల పాఠశాలలకు అద్దెలు చెల్లించకపోవడం, విద్యార్థులకు సరైన భోజన, వసతి సౌకర్యాలు కల్పించకపోవడం, విద్యార్థినులకు ఈస్కూటీలు అందించకపోవడం వంటి సమస్యలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిరుద్యోగ సమస్య, అవినీతి ఆరోపణలు, అభివృద్ధి పనుల్లో జాప్యం, ఎన్నికల హామీల అమలులో వైఫల్యంతో యువత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు పట్టభద్రులు తమ ఓటు ద్వారా సమాధానం చెప్పాలని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి పట్టభద్రులు, మేధావులు, యువత మద్దతుగా నిలిచి గెలిపించాలని పేరపు ఆనంద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, ఐదో వార్డు కౌన్సిలర్ పాశికంటి సంపత్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చిలుగూరి శాంతిరెడ్డి, బీజేవైఎం మండల కన్వీనర్ మంత్రి సాయి, ఆలేరు ఎమ్మెల్సీ పట్టణ కన్వీనర్ జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, బడుగు జహంగీర్, కొమ్ము శ్రవణ్, , ప్రదీప్, టిల్లు పలువురు పట్టభద్రులు పాల్గొన్నారు.

ఈ నెల 8న సబ్‌జూనియర్ బాలుర కబడ్డీ ఎంపికలు

ఆలేరు, నవంబర్ 05(సమయం న్యూస్):



యాదాద్రి భువనగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఆదివారం సబ్‌జూనియర్ బాలుర జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య తెలిపారు. ఆలేరు పట్టణంలోని ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 60 కిలోల లోపు బరువు కలిగి ఉండాలని, 010డిసెంబర్ 13న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలని చించారు. వయస్సు ధ్రువీకరణ కోసం ఎస్ఎస్సీ మెమో లేదా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకురావాలనికోరారుఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12, 13, 14 తేదీల్లో వికారాబాద్ జిల్లా యానపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.